ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 10 ఏప్రిల్ 2025 | 5





పల్లె నుంచి.. పదవుల పల్లకీలోకి..

- తెలుగుదేశంలోనే రాజకీయ అరంగేట్రం
- తొలిసారే ఎమ్మెల్యే.. మంత్రి కూడా..
- 42 ఏళ్లు ఒకే పార్టీ.. ఒకటే జెండా
- ఏవీ నగరానికి కీర్తికిరీటం యనమల
- నేడు తునిలో రాజకీయ ప్రస్థాన సభ

6

- పుస్తకావిష్కరణ.. ఫొటో గ్యాలరీ ఏర్పాటు



అర్ధరాత్రి అలజడి!

- బాణసంచా కాల్పుల్లో విస్ఫోటనం
- భయంతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు
- రామచంద్రపురంలో ప్రకంపనలు
- పగిలిన వాణిజ్య భవనాల అద్దాలు
- రూ.18.20 లక్షల ఆస్తినష్టం

7

దారుణం!

- బాలబాలికలపై వృద్ధుడి లైంగిక చర్యలు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసు విచారణ
- పోక్సో కేసు.. పోలీసుల అదుపులో నిందితుడు
- అతడికి హెచ్ఐవీ ఉండడంతో ఆందోళన
- తొమ్మిది మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

7

వయసు 33.. కేసులు 69

- 16 ఏళ్ల నుంచే చోరీలు
- అంతర్ జిల్లా దొంగ ఆట కట్టించిన పోలీసులు

7

పాస్టర్ ప్రవీణ్ మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు : ఎస్పీ

రుణం.. రణం!





ఇటీవల బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

- ప్రజాప్రతినిధులకు 'సవాల్'గా మారిన కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో బీసీ, కాపు కార్పొరేషన్లకు 7,303 యూనిట్లు మంజూరు
- అందిన దరఖాస్తులు 1,11,038.. అర్హత సాధించిన వారు స్వల్పమే
- లబ్ధిదారులకు షాక్ ఇస్తున్న బ్యాంకులు.. రుణాల కోసం ఎమ్మెల్యేలపై ఒత్తిడి
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ సామాజికవర్గాల వారికి రుణాల పంపిణీ కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లకంటే 15 రెట్లు అధికంగా దరఖాస్తులు పోటెత్తాయి. దాంతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికార యంత్రాంగం అష్టకష్టాలు పడుతోంది. మరోవైపు దరఖాస్తుదారుల ఒత్తిడితో అర్హులైన లబ్ధిదారులను సిఫారసు చేసేందుకు ఎమ్మెల్యేలు సైతం ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ కింద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 7,303 యూనిట్లు మంజూరు కాగా వాటికోసం 15 రెట్లు అధికంగా అంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షా 11వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిని ఆయా పట్టణాలు, కార్పొరేషన్లు, మండలాల వారీగా ఇటీవల అధికారులు ఇంటర్వ్యూలకు పిలిచి రుణాలకు అర్హులైన లబ్ధిదారుల అన్వేషణలో పడ్డారు. ఈ దశలోనే రాజకీయ ఒత్తిళ్లతో రుణాలు తమకే మంజూరు చేయాలంటూ పట్టణ, మండల స్థాయి ప్రజాప్రతినిధుల ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, మరికొందరైతే మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సుల పేరుతో రుణ మంజూరు కోసం పైరవీలు చేస్తున్నారు. ఈ పరిణామాలు ప్రస్తుతం కూటమి ప్రజాప్రతినిధులకు ప్రాణసంకటంగా మారింది. ఎవరిని నొప్పించినా రానున్న రోజుల్లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతాయనే ఆందోళన వారిలో కనిపిస్తోంది.

దరఖాస్తుదారులు 15 రెట్లు అధికం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 7,303 యూనిట్లకుగాను మొత్తం 1,11,038 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో బీసీ కార్పొరేషన్ ద్వారా 63,412 మంది. కాపు కార్పొరేషన్ల ద్వారా 45,290, ఈడబ్ల్యుఎస్ కింద 2336 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వాటన్నింటినీ ఆయా కార్పొరేషన్‌కు చెందిన అధికారులు విశ్లేషించి అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటిలో భాగంగా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం కాకినాడ జిల్లాలో 1,895 యూనిట్లకోసం 31,856 మంది దరఖాస్తు చేశారు. వారిలో ఆయా మండలాలకు చెందిన అధికారులు 777 మందిని ఎంపిక చేయగా 245 మందికి రుణాలు ఇచ్చేందుకు ప్రస్తుతం బ్యాంకర్లు అంగీకరించారు. అదే విధంగా కాపు కార్పొరేషన్ కోసం 775 యూనిట్ల కోసం 21,455 మంది దరఖాస్తు చేయగా వారిలో 390 మందిని అధికారులు ఎంపిక చేశారు. 106 మందికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బీసీ కార్పొరేషన్‌కు 1,366 రుణాలు లక్ష్యం కాగా 15,148 మంది దరఖాస్తు చేశారు. వారిలో మండలస్థాయిలో అధికారులు 399 మందిని ఎంపిక చేయగా కేవలం 22 మంది లబ్ధిదారులకు మాత్రమే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి. అదేవిధంగా కాపు కార్పొరేషన్ ద్వారా 756 యూనిట్ల లక్ష్యం కాగా 15,643 మంది దరఖాస్తు చేశారు. మండలస్థాయి అధికారులు ఇప్పటివరకు 343 మందిని ఎంపిక చేశారు. కేవలం 16 మందికే బ్యాంకులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. తూర్పుగోదావరికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా 1,341 యూనిట్లు లక్ష్యంగా కాగా ఇందుకోసం 16,408 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో అధికారులు 243 మందిని ఎంపిక చేయగా బ్యాంకులు మాత్రం 23 మంది లబ్ధిదారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 758 యూనిట్ల లక్ష్యం కాగా 8,192 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 174 మందిని అధికారులు ఎంపిక చేయగా కేవలం తొమ్మిది మందికి మాత్రమే ఇప్పటికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి.

ఎమ్మెల్యేలకు శిరోభారం..

బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ రుణాలకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలపై తీవ్ర ఒత్తిడి ప్రారంభమైంది. తమ వారికే రుణాలు మంజూరుచేసేలా సిఫార్సులు చేయాలంటూ లబ్ధిదారులను వెంటేసుకుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు వారి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని, మేము పెట్టుకున్న లోన్లు మంజూరు చేయకపోతే గ్రామాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాల్సి వస్తుందంటూ కొందరు పరోక్ష హెచ్చరికలు చేస్తున్నారు. అయితే రుణాల మంజూరులో గానీ, లబ్ధిదారుల ఎంపికలో గానీ తమ ప్రమేయం ఏమీ ఉండదని, అభ్యర్థుల అర్హతలు, వారు పెట్టుకునే వ్యాపారాలకు సంబంధించి యూనిట్లు, బ్యాంకుల్లో వారికి ఉన్న సిబిల్ స్కోర్ వంటి వాటిని పరిగణలోకి తీసుకుని కార్పొరేషన్ అధికారులు రుణాలు మంజూరు చేస్తారని ప్రజాప్రతినిధులు నచ్చచెబుతున్నారు. ఇక దరఖాస్తుల సమయంలో ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా ఇప్పుడు వార్డుకు ఒకటి, గ్రామానికి ఒకటి లోన్లు ఇస్తే ఎలాగంటూ నేతలు తలలుపట్టుకుంటున్నారు.

బీసీ రుణాలు.. సబ్సిడీలు..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

బీసీలకు ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంక్ రుణాలతో ఈ సహాయం అందుతుంది. యూనిట్ విలువ రూ.2 లక్షల వరకూ ఉంటే సబ్సిడీ 50 శాతం లేదా, రూ.75 వేలు మించకుండా ఉంటుంది. యూనిట్ కాస్ట్ రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకూ ఉంటే 50 శాతం లేదా, రూ.1,25,000వరకూ సబ్సిడీ ఉంటుంది. రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకూ యూనిట్ విలువ ఉంటే, సబ్సిడీ రూ.2 లక్షల వరకూ ఉంటుంది. జనరిక్ మెడికల్ షాపులకు కూడా రుణాలు ఇస్తున్నారు. రూ.8 లక్షల విలువ ఉంటే రూ.4 లక్షలు సబ్సిడీ లభిస్తోంది. మేదర, కుమ్మర శాలివాహన వారికి బుట్టల అల్లకం, కుండల తయారీకి రుణమిస్తారు. యూనిట్ కాస్ట్ రూ.3 లక్షలుంటే రూ.1.5 లక్షల సబ్సిడీ ఉంటుంది. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ పథకం కింద రూ.25 లక్షల వరకూ యూనిట్ విలువ ఉంటుంది. ఇందులో రూ.10 లక్షలు సబ్సిడీ, రూ.10 లక్షలు బ్యాంక్ రుణం, రూ.5 లక్షలు లబ్ధిదారుడి వాటా.

ఆహార భద్రతా చట్టం

పకడ్బందీగా అమలు కావాలి

- ఆహార కమిషన్ సభ్యుడు కృష్ణకిరణ్



మాట్లాడుతున్న కృష్ణకిరణ్, పక్కనే జేసీ నిషాంతి

అమలాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా చట్టం అమలులో అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణకిరణ్ అన్నారు. బుధవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో వివిధశాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులతో ఆహార భద్రతా చట్టం అమలుపై సమీక్షించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ నెల 9, 10తేదీల్లో రెండురోజులపాటు జిల్లాలో పర్యటిస్తామని, వివిధ అంశాల్లో గుర్తించిన లోటుపాట్లను సహృద్భావ వాతావరణంలో సరిదిద్దాలని కోరారు. బాల్య వివాహాలను అరికట్టాలని, దీనికోసం ప్రతిఒక్కరూ ప్రత్యేకంగా కృషిచేయాలని సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని కిరణ్ సమీక్షించారు. జేసీ టి.నిషాంతి మాట్లాడుతూ చట్టం మార్గదర్శక సూత్రాల్లో గర్భిణులు, బాలింతలు, 14ఏళ్లలోపు పిల్లలకు ఐసీడీఎస్, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమగ్ర శిశు అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయన్నారు. డీఎస్వో ఉదయభాస్కర్, ఏఎస్వో శరత్, సివిల్ సప్లయిస్ డీఎం కుమారి బాలసరస్వతి, డీఎంహెచ్‌వో దుర్గారావు దొర, తూనికలు, కొలతలశాఖ కంట్రోలర్ రాజేష్, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారిణి జ్యోతిలక్ష్మీదేవి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, బీసీ సంక్షేమాధికారి రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో తనిఖీలు



అల్లవరం హైస్కూల్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఆహార కమిషన్ సభ్యుడు కృష్ణకిరణ్

అమలాపురం టౌన్/అల్లవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణకిరణ్ బుధవారం అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం మండలాల పరిధిలోని వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో చిన్నారులు, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. పట్టణంలోని 1వ వార్డు పరిధిలోని మెట్ల కాలనీలో ఉన్న 282వ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రాయపురెడ్డి లక్ష్మీసంధ్య అనే బాలింతను, ఆమెకు అందుతున్న సహాయంపై ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. అమలాపురం, అల్లవరంమండలాల్లో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఒక చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. కామనగరువు అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణ తీరు అధ్వానంగా ఉందని, ఇన్‌చార్జి లేకపోవడంతో తాళాలు వేసి పక్కింటి వారికి ఇచ్చి వెళ్లడంతో నిత్యావసర వస్తువులు పూర్తిగా పాడైపోయాయని అక్కడివారు ఆవేదన చెందారు. అల్లవరం జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన బియ్యం లెక్కలకు పొంతనలేదని, మెనూ పూర్తిగా పాటించడం లేదని, పిల్లలకు సరిపడా ఆహార పదార్థాలు తయారు చేయలేదని, ఆ స్కూల్‌లో పరిస్థితి తీవ్రతపై స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలని కిరణ్ ఆదేశించారు. అల్లవరం, కె.పెదపూడిలో చౌకదుకాణాలను పరిశీలించారు.

యానాం ఎమ్మెల్యే ఫొటోతో పోస్టులు

7

- మహిళలను మోసం చేసిన రాజమండ్రి యువకుడి అరెస్ట్



ఆర్డీవోలతో సమీక్షిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

రైల్వేలైన్ భూసేకరణ

చేపట్టాలి

- ఆర్డీవోలను ఆదేశించిన ఎంపీ హరీష్

అమలాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతిలో రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆదేశించారు. రైల్వేలైన్ నిర్మాణ ప్రగతిపై అమలాపురం, కొత్తపేట ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్‌లతో సమీక్షించారు. పనులకు సంబంధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రైల్వేలైన్ భూసేకరణ కార్యాచరణ ప్రణాళిక అమలుకు సంబంధించి కొన్ని సూచనలు చేశారు. రైల్వేలైన్ నిర్మాణంపై సీఎం చంద్రబాబు, రైల్వే మంత్రితో మాట్లాడి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

లాకుల వ్యవస్థ.. అస్తవ్యస్తం!



ఆలమూరు మండలం చొప్పెల్ల లాకులవద్ద నీరు నిలిపినా తలుపుల నుంచి వెళ్లిపోతున్న వైనం



ఆలమూరు లాకుల వద్ద రెండేళ్ల క్రితమే కుప్పకూలిన నేవిగేషన్ వే

- నీరుగారుతున్న ఇరిగేషన్ లాకులు
- ఏడేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- కాలువ తవ్వకాల దుస్థితి దయనీయం
- ఆలమూరువద్ద నేవిగేషన్ వే రెండేళ్ల క్రితమే కుప్పకూలినా పట్టించుకోని అధికారులు

ఆలమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):సాగునీరు అందించే ప్రధాన లాకులపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే లాకుల వ్యవస్థ కనుమరుగయ్యే పరి స్థితి కనిపిస్తోంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఇరిగేషన్‌వ్యవస్థ కనీసం మరమ్మతులు నోచుకోకపోవడంతో మరింత శిథిలమవుతున్నాయి. కాలువలకు నీరు నిలుపుదల చేసిన సమయంలో మరమ్మతులు చేస్తే ఇరిగేషన్ సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఆలమూరుమండలపరిధిలోని చొప్పెల్ల ప్రధాన లాకుల శిథిలావస్థకు చేరుకున్నాయి. దిగువ స్థాయిలో ఆలమూరు లాకుల పరిస్థితి అలానే ఉంది. ధవళేశ్వరం బ్యారేజ్‌నుంచి వచ్చే కాలువ నేరుగా చొప్పెల్లవద్ద లాకుల వ్యవస్థను బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ నీరు అదుపు చేయడానికి వీలు ఉంటుంది. చొప్పెల్ల లాకులనుంచి పంటకాలువలకు సక్రమంగా నీరు అందించేందుకు ఇక్కడ లాకులు ఎంతగానో ఉపకరిస్తాయి. ఆలమూరువద్ద లాకులున్నాయి. ఇక్కడినుంచి కాలువలకు సాగునీరు వేలాది ఎకరాలకు అందించేందుకు నీరు అదుపు చేసి పంటకాలువలకు మళ్లిస్తారు. చొప్పెల్ల లాకుల వద్ద నీరు నిలుపుదల చేస్తే లాకుల తలుపులు చెడిపోవడంతో దిగువకు వెళ్లిపోతోంది. దీంతో పంటకాలువలకు సాగునీరు చేరట్లేదు.

దీనస్థితిలో చొప్పెల్ల లాకులు

ధవళేశ్వరం ఆనకట్ట నుంచి వచ్చే తూర్పుకాలువకు మొదటిగా చొప్పెల్ల లాకులున్నాయి. ఈ లాకులపై నీరు నిలిపి పంటకాలువలకు నీరు అందిస్తారు. దీంతో ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందించాలి. ఇక్కడ లాకుల గేట్లతో పాటు నేవిగేషన్ గేట్లు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో నీరు నిలగట్టడం ఇబ్బందిగా మారింది. ఈ కారణంగా దిగువ ప్రాంతాలకు సక్రమంగా సాగునీరు అందడంలేదు. ఆలమూరు లాకులకు ముందు అధికనీరు వచ్చే సమయాల్లో అదనపు నీటిని టేక్‌డ్రైన్‌లోకి మళ్లించేందుకు బ్రిటీష్‌కాలం నాటి వ్యవస్థ ఉండగా అక్కడ గేట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి తుప్పుపట్టి సాగునీరు మురుగుకాలువలోకి వెళ్లిపోతుండడంతో ఇరిగేషన్ ఇబ్బంది గేట్లకు బరకాలు ఏర్పాటు చేశారు.

శిథిలమవుతున్న క్వార్టర్స్..

లాకులవద్ద నిరంతరం ఉండి వాటిని పరిరక్షించేందుకు కొంతమంది సిబ్బంది అక్కడ ఉండేలా బ్రిటీష్ కాలంలో క్వార్టర్స్ ఏర్పాటు చేశారు. సరైన నిర్వహణ లేకపోవడంతో ఆలమూరు, చొప్పెల్ల లాకులవద్ద ఉన్న క్వార్టర్స్ శిథిలమవుతున్నాయి. శిథిలమవుతున్న ఇరిగేషన్ వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి నిధుల కేటాయింపులు చేసి కనీస మరమ్మతులు చేయిస్తే కొంతకాలంపాటు లాకులు పదిలంగా ఉంటాయని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో ముగిసిన పది మూల్యాంకనం

- డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలో చేపట్టిన పదో తరగతి పరీక్షల స్పాట్‌వాల్యూయేషన్ బుధవారంతో ముగిసినట్టు డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఈనెల 3 నుంచి 9వరకు స్పాట్ వాల్యూయేషన్ నిర్వహించామని ఆయన చెప్పారు. జిల్లాలో 19వేలమంది విద్యార్థుల 1,87,226 జవాబు పత్రాలు ఉపాధ్యాయులు మూల్యాంకనం చేశారన్నారు. వీటిని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌కు పంపించామని డీఈవో వివరించారు.

గోదావరి నదీగర్భంలో.. ఇసుక తవ్వకాలు



ముమ్మిడివరం మండలం గేదెల్లంక ఉత్తరవాహిని పుష్కరరేవువద్ద నదీగర్భంలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వి ట్రాక్టర్లపై తరలిస్తున్న దృశ్యం

- గోదావరిలో గేదెల్లంక ఉత్తరవాహిని పుష్కరరేవులో నదీపాయ నుంచి అక్రమంగా ఇసుక తరలింపు
- ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముమ్మడివరం మండలం గేదెల్లంక ఉత్తరవాహిని పుష్కరరేవు నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఉత్తరవాహిని పుష్కర రేవు వద్ద గోదావరి నదీగర్భంలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను ట్రాక్టర్లలోకి ఎగుమతి చేసి అక్కడినుంచి తరలించుకుపోతున్నారు. ఇసుక తరలింపునకు సంబంధించి అనుమతులు లేకపోయినా స్థానిక అవసరాల ముసుగులో ఇసుక అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. 20 ట్రాక్టర్లు ఒక్కొక్కటీ పది ట్రిప్పుల చొప్పున 200 నుంచి 250 ట్రిపులు తరలించుకుపోతున్నారు. ట్రాక్టరు ఇసుకకు స్థానికంగా ర్యాంపులో రూ.500 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. బయట ఆ ఇసుకను రూ.1500 నుంచి రూ.2వేల వరకు విక్రయిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి ఇసుకను తీయడంవల్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. నదీ స్నానానికి వచ్చిన యువకులు ఆరుగురు వరకు మునిగి మృతి చెందారు. ఉత్తరవాహిని పుష్కరరేవును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ గేదెల్లంక విచ్చేసిన సందర్భంగా హామీ ఇచ్చారు. పవిత్రమైన పుష్కర రేవులో ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నా అధికారులు ఎవరూ స్పందించకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు నిలుపుదల చేసి ఉత్తరవాహిని పుష్కరరేవు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పల్లె నుంచి పదవుల పల్లకీలోకి...

42 ఏళ్లు ఒకే పార్టీ... ఒకటే జెండా
ఏవీ నగరానికి కీర్తి కిరీటం
యనమల రామకృష్ణుడు

తొండంగి/తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతానికి చేరువలో ఉన్న అతి చిన్న గ్రామం ఏవీ నగరం. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ఉన్న ఈ గ్రామాన్ని రాష్ట్ర రాజకీయ యవనికపై ఘనంగా నిలిపిన ఘనత టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకే దక్కుతుంది. 42 ఏళ్ల ఆయన రాజకీయ ప్రస్థానంలో యనమల ఉన్నతిని చూసి స్వగ్రామమైన ఏవీ నగరం మురిసింది. ఈ గ్రామం అంటే ఆయనకూ అంతే ప్రేమ. రాష్ట్రంలో కీలకమైన పాలనా బాధ్యతలు భుజాన మోస్తున్న తరుణంలో కూడా సొంతూరికి వెళ్లి రావడానికే ఎప్పుడూ తొలి ప్రాధాన్యమే ఇచ్చారు. యనమల అప్పారావు-సరస్వతి దంపతులకు ఆఖరి సంతానం రామకృష్ణుడు. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోనే. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు సమీపంలోని రావికంపాడు ఉన్నత పాఠశాలలోను, పది నుంచి డిగ్రీ వరకు రాజమహేంద్రవరంలోను విద్యాభ్యాసం చేశారు. ఎంఏ, ఎల్‌ఎల్‌బీ మధ్యప్రదేశ్‌లో చదివారు. అనంతరం కాకినాడలో న్యాయవాద వృత్తి చేపట్టారు.

రాజకీయ ప్రస్థానం ఇలా...

అప్పటి కాంగ్రెస్ రాజకీయాలతో విసిగి వేసారిన తుని ప్రాంత ప్రజలు ఐక్య సంఘంగా ఏర్పడి ఎన్నికల బరిలో నిలిపేందుకు అనువైన అభ్యర్థి కోసం వెతుకుతున్న సందర్భంలో సామాజికపరంగాను, విద్యాపరంగాను అన్ని అర్హతలు ఉన్న యనమల రామకృష్ణుడు వారి దృష్టిని ఆకర్షించారు. అదే సమయంలో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించడంతో ఐక్య సంఘం మొత్తం యనమల వెంట నిలిచి ఆయన్ను తుని నుంచి బరిలోకి దింపేందుకు కృషి చేసింది. అత్యున్నత విద్యార్హతలతో పాటు మృదుస్వభావం ఉన్న యనమల ఎన్టీఆర్ దృష్టిని కూడా ఆకర్షించడంతో ఆయన రాజకీయ ప్రస్థానానికి అంకురార్పణ జరిగింది. 1983లో తుని నుంచి యనమల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. నాటి నుంచి వరుసగా ఒకే పార్టీ ఒకే గుర్తుపై ఆరుసార్లు ఎన్నికయ్యారు. రెండుసార్లు శాసనమండలి సభ్యునిగా పనిచేశారు. మొదటి గెలుపులోనే పురపాలక, న్యాయ శాఖ మంత్రిగా అతిపిన్న వయసులో పదవి చేపట్టారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఆయనకు ఉన్నత పదవులు దక్కాయి. మేధావిగా, పార్టీ సిద్ధాంతకర్తగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా, శాసనమండలి ప్రతిపక్ష నేతగా... పదవులకే వన్నె తెచ్చారు. ఎన్ని పదవులు చేపట్టినా ఆయన స్వగ్రామానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికీ ఆయన తన ఓటు హక్కును స్వగ్రామంలోనే వినియోగించుకుంటున్నారు.

పుట్టిన ఊరు రుణం తీర్చుకునేందుకు యనమల తమ స్వగ్రామమైన ఏవీ నగరంలో అనేక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయాలను నిర్మించి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అనేక మంది పీఠాధిపతులు, ప్రవచనకర్తలు ఆలయాన్ని సందర్శించారు. 2014లో యనమల ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనేక మెడికల్ క్యాంపులు నిర్వహించారు. స్థానిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ సదుపాయం కల్పించారు. విద్యార్థులకు లక్షలాది రూపాయలను ఉపకార వేతనాలుగా అందించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించారు. గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. అనేక క్రీడా పోటీలు నిర్వహించారు. దీంతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. 42 సంవత్సరాల ప్రస్థానంలో స్వగ్రామం ఆయన వెన్నంటి నిలిచింది. అదే రీతిలో యనమల కన్న ఊరును మరిచిపోకుండా ఇప్పటికీ ఏవీ నగరం బిడ్డగానే మసలుతున్నారు.


తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుతో రామకృష్ణుడు



చంద్రబాబునాయుడుతో యనమల

నేడు తునిలో ‘42 వసంతాల రాజకీయ ప్రస్థానం’ పుస్తకావిష్కరణ

తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యనమల రామకృష్ణుడు 42 వసంతాల రాజకీయ ప్రస్థానం సభ, పుస్తకావిష్కరణ గురువారం సాయంత్రం తునిలో జరగనున్నాయి. టీడీపీ తుని నియోజకవర్గ శ్రేణుల ఆధ్వర్యంలో తుని పట్టణ శివారులోని సాయి వేదిక ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేస్తారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఫొటో గ్యాలరీని ప్రారంభిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సీనియర్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్టు పార్టీ నాయకులు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు ఆరువేల మందికి పైగా తరలివస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేశారు. సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య బుధవారం పరిశీలించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివ్య

రైతు కావ్యానికి ఉత్తమ దీర్ఘ కవితా పురస్కారం



కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా అత్యుత్తమ దీర్ఘ కవితా పురస్కారం ‘వచన కవితా సహస్రావధాని’ ర్యాలి ప్రసాద్ రచించిన రైతు కావ్యానికి లభించింది. భారతదేశంలోని రైతుల దుర్భర జీవితాన్ని, రైతుల ఆవశ్యకతను తెలుపుతూ రచించిన ఈ కావ్యం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ప్రతి ఒక్క రైతు విలువను తెలిపేలా రచయిత ఈ కావ్యాన్ని రచించారని ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య మక్కెన శ్రీను తెలిపారు. ఈ నెల చివరి వారంలో పురస్కార ప్రదానోత్సవం ఉంటుందని చెప్పారు. ప్రసాద్‌ను పలువురు సాహితీవేత్తలు, ఆదిత్య యూనివర్శిటీ చాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి, కాకినాడ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు గొడవర్తి సత్యమూర్తి, కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ, కోశాధికారి వడిశెట్టి భాస్కరరెడ్డి, కార్యవర్గ సభ్యులు అభినందించారు.


రచయిత ర్యాలి ప్రసాద్

రెండో రోజుకు సైనిక విన్యాసాలు


ఆకాశంలో చక్కర్లు కొడుతున్న యుద్ధ విమానం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్ సైనిక విన్యాసాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం యుద్ధ విమానాలు ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికాదళం, అమెరికా (యూఎస్) యాంఫీబియాస్ విన్యాసాల్లో భాగంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఇరు దేశాలు సంయుక్తంగా సముద్రం, ఆకాశంలో సైనిక విన్యాసాలు నిర్వహించాయి. టైగర్ ట్రయింఫ్ యాంఫీబియాస్ విన్యాసాలు ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయని త్రివిధ దళాల అధికారులు తెలిపారు. విన్యాసాలు జరిగే ఔటర్ ప్రాంతాలను కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత పర్యవేక్షించారు.


సూర్యారావుపేట తీర ప్రాంతంలో యుద్ధ ట్యాంకర్లు, వాహనాలు

అంతర్వేదిలో సాగర్ కవాచ్


బోటును తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీసులు

అంతర్వేది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీర ప్రాంతంలో మెరైన్ పోలీసులు, సీఐ అల్లు నవీన్ నరసింహ ఆధ్వర్యంలో బుధవారం సాగర్ కవాచ్ నిర్వహించారు. ముష్కరులను పట్టుకునేందుకు అంతర్వేదిలో పోలీసు, మెరైన్ సిబ్బంది 58 మందితో, పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెంలో 68 మందితో సాగర్ కవాచ్ నిర్వహించారు. గురువారం కూడా సాగర్ కవాచ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కె.దుర్గాశ్రీనివాస్, నాగరాజు, వీరాస్వామిరాజు పాల్గొన్నారు. బుధవారం తీర ప్రాంతమైన అల్లవరం మండలం ఓడలరేవు నుంచి అంతర్వేది మీదుగా పేరుపాలెం వరకు సాగర్ కవాచ్ నిర్వహించారు.

ఏపీఈఏపీసెట్‌కు 2,83,070 దరఖాస్తులు

- మే 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు
- అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
- కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు


ఏపీఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్)-2025కు ఇప్పటివరకు 2,83,070మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు బుధవారం ‘ఆంధ్ర జ్యోతి’కి తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,22,989 మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 59,507మంది, రెండింటికీ 574 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మే 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏపీలో 46, తెలంగాణలోని హైదరాబాద్‌లో 2కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. గత ఏడాది వరకు తెలంగాణ ఈఏపీసెట్‌కు ఏపీ విద్యార్థులు, ఏపీఈఏపీసెట్‌కు తెలంగాణ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేవారు. కానీ రెండు రాష్ట్రాలు నాన్ లోకల్ కోటా తీసేయడంతో ఏపీ ఈఏపీసెట్‌కు ఈఏడాది సుమారు 30వేలకుపైగా దరఖాస్తులు పెరిగే అవకాశముందన్నారు. విద్యార్థులు https://cets. apsche. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

మే 19 నుంచి 20 వరకు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మే 21నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మే 24న పరీక్ష ఒక సెషన్‌లో మాత్రమే ఉంటుందని 25న పరీక్ష ఉండదన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికి https:// cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారాగానీ 0884 2359599, 2342499 నెంబర్లలోగానీ helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారాగానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సుబ్బారావు సూచించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే ‘తలాష్’

- నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రసన్నశ్రీ

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వ్యాపార దృక్పథం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచడంతో పాటు సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘తలాష్’ ఫెస్ట్ ఉపయోగపడుతుందని నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో కామర్స్-మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో తలాష్-2కే25 జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతిశ్రీతో కలిసి ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సవాళ్లను ఎదుర్కోవడానికి ఇటువంటి నాలెడ్జ్‌ఫెస్ట్‌లు ఉపయోగపడతాయన్నారు. ప్రతి విషయాన్నీ సృజనాత్మకతతో ఆలోచించడం అలవర్చుకోవాలని, పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు కొం గొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు చేయడంతో నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చక్కని కార్యక్రమం నిర్వహించిన కామర్స్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులను అభినందించారు. ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాత్ గుప్త మాట్లాడుతూ ఈ ఫెస్ట్ ఉద్యోగ అవకాశాలకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. మేనేజ్‌మెంట్ గేమ్స్ విభాగంలో కార్పొరేట్ చాలెంజ్, ట్రేడింగ్ టైటాన్స్, బిజినెస్ ఆర్కిటెక్ట్స్, స్ట్రాటజీ సీకర్స్, కేస్‌ఏ మేనియా, నెక్ట్స్ బాస్, ట్రెజర్ హంట్, స్పీక్ స్మార్ట్ వంటి పోటీల పట్ల విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరిచారు. విద్యార్థులకు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలు, మిస్టర్ అండ్ మిస్ తలాష్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రోగ్రామ్, కామర్స్ మేనేజ్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ డి.అజయ్ రతన్, ఓఎన్జీసీ జీఎం (హెచ్‌ఆర్) కె.సునీల్, అధ్యాపకులు డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ మధుకుమార్, మణికంఠేశ్వర్‌రెడ్డి, మనోజ్ దేవ, డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమారజిత, తాడేపల్లిగూడెం క్యాంపస్, ఆదిత్య, పైడా, సంజీవి, ప్రకాష్, స్పేస్, ఏఎస్‌డీ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ


గన్నవరంలో కల్లంలో తడిసిన మిర్చిపంట

అకాల వర్షం..

- కల్లాల్లో మిర్చికి దెబ్బ
- ధర, దిగుబడిలేక ఇప్పటికే రైతు కుదేలు

ఎటపాక ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి: అకాల వర్షం మిర్చి రైతుని మరోమారు నష్టాల ఊబిలోకి నెట్టింది. బుధవారం రాత్రి గాలి వానతో వర్షం కురిసింది. దాంతో ఇప్పటికే కోతలు నిర్వహించి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిపంట తడిసిపోయింది. కొందరు రైతులు ముందుగా వాతావరణ పరిస్థితులను గమనించి ఆరబెట్టిన పంట, మిర్చి రాశులపై టార్పాలిన్లు, బరకాలు రక్షణగా కప్పారు. అయినా చాలాచోట్ల వర్షం రాకను గమనించకపోవడంతో కల్లాల్లో ని పంట తడిసిపోయింది. దీంతో పంట తడ వడంతో రంగుమారి నాణ్యత కోల్పోయి ధర తక్కువగా పలుకుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పంటకు సరైన ధర, దిగుబడిలేక కుదేలైన రైతుకు వర్షం మరో ఎదురుదెబ్బలా తగిలినట్లైంది. ఏజెన్సీలో ఈనెలాఖరు వరకు మిర్చి కోతల పనులు చేపట్టనున్నారు.


నందిగామలో మిర్చిపై కప్పిన టార్పాలిన్లు

నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం రూ.18.25లక్షలు


చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర ఉత్సవం అనంతరం హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.18,25,424లు లభించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవప్రత్యేకాధికారి బాలాజీరామ్‌ప్రసాద్‌ల ఆధ్వర్యంలో హుండీలను తెరచి లెక్కించారు. మార్చి 27నుంచి ప్రారంభమైన జాతర ఉత్సవాలకు ముందు హుండీలను లెక్కించగా ఉత్సవాల తదుపరి బుధవారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ ఛైర్మన్ గన్ని వెంకట్రావు, మాజీ ఛైర్మన్‌లు వైట్ల శేషబాబు, దొమ్మేటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతర ఆదాయం రూ.54.07లక్షలు

చింతలూరు నూకాంబికా అమ్మవారి జారత ఉత్సవాల సందర్భంగా రూ.54.07లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వీర్రాజుచౌదరి తెలిపారు. జాతర ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వేలంపాటల ద్వారా రూ.13,13 లక్షలు, టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.16.48లక్షలు, భక్తుల విరాళాలు రూ.3.88లక్షలు, షాపుల ద్వారా రూ.2.15లక్షలు, అమ్మవారి పొన్నుల ద్వారా రూ.17.8వేలు, వివిధ ఆదాయాల ద్వారా రూ.44వేలు, హుండీ ద్వారా రూ.18,25,424లు ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

వైభవంగా పొన్న వాహన మహోత్సవం

- మూడో రోజు స్వామివారి శ్రీకల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణమహోత్సవాలలో భాగంగా మూడోరోజు బుధవారం స్వామివారి మేలుకొల్పు, గౌతమినది నుంచి తీర్థపు బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించారు. విశేష అర్చన, నిత్యహోమాలు, బలిహరణ, ద్రవిడవేద పారాయణం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ప్రధాన హోమాలు, దిగ్దేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తణుకు సత్యాపురానికి చెందిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 7.01నిమిషానికి ఉభయదేవేరులతో స్వామివారు పొన్నవాహనంపై అలంకృతుడయ్యారు. మేళతాళ మంగళవాయిద్యాలు వేద మంత్రోచ్చరణల నడుమ తిరువీధులలో పొన్నవాహనసేవ ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. విద్యుత్‌కాంతులనడుమ ఉత్స వాలను నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు.


పొన్నవాహనంపై శ్రీవారు



గోదావరి నదీజలాలను తీర్థపు బిందెతో తీసుకువస్తున్న దృశ్యం, పొన్నవాహన మహోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

అర్ధరాత్రి అలజడి!



విస్ఫోటనం జరిగిన ప్రాంతం

- బాణసంచా కాల్పుల్లో భారీ విస్ఫోటనం
- భయంతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు
- రామచంద్రపురంలో కంపించిన భవనాలు
- పగిలిన వాణిజ్య సముదాయాలు, భవనాల అద్దాలు, రూ.18.20 లక్షల ఆస్తినష్టం

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మార్కెట్ సెంటర్ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ సంబరాల్లో అపశృతి చోటుచేసుకుంది. సంబరాల్లో మంగళవారం అర్ధరాత్రి 12.51 గంటలకు బాణసంచా కాల్పుల్లో భారీ విస్ఫోటనం సంభవించింది. పేలుడుధాటికి మార్కెట్ సెంటర్‌లోని రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో వాణిజ్యసముదాయాలు, వికాస్ కళాశాల, సినిమా థియేటర్లు, పలు భవనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. 1000 మీటర్ల వరకు పేలుడు ప్రభావం కనిపించింది. లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. అర్ధరాత్రి భవనాలు కంపించడంతో ప్రజలు భయాందోళనలు చెందారు. భయంతో రోడ్లపైకి చేరుకున్నారు.

అసలేం జరిగిందంటే....

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో మంగళవారం రాత్రి నుంచి బాణసంచా కాల్పులు ప్రారంభించారు. 12.50 గంటల ప్రాంతంలో పేలుడు శబ్దం వెలిగించారు. అది దశలవారీగా పేలవలసి ఉంది. అయితే స్తంభానికి చుట్టిన నారబొట్లు, టపాసులవద్ద జారి పోవడంతో భారీ విస్ఫోటనం సంభవించింది. పేలుడు ధాటికి పక్క నే ఉన్న వికాస్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్ అద్దాలు ధ్వంసం కావడంతో పాటు మూడో అంతస్తులో క్లాసురూముల్లో పీవోపీ సీలింగ్ ఊడిపడిపోయింది. గోడలు బీటలు వారాయి. కళాశాల బస్సు అద్దాలు పగిలిపోయాయి. కంప్యూటర్ ల్యాబ్‌లో సీసీ కెమెరాలో పేలుడు ధాటికి అద్దాలు ధ్వంసం కావడం రికార్డయింది. రెండు నిమిషాలకుపైగా అద్దాలు ధ్వంసం కావడం కనిపించింది. పక్కనే ఉన్న వెంకటరమణ సిమెంటు, ఐరన్‌ట్రేడర్స్ షాపుల సముదాయంలో నష్టం సంభవించింది. హవెల్స్ షోరూమ్, సెరాస్టైల్ సెంటర్ అద్దాలు పగిలిపోయాయి. పట్టర్ల వేసి ఉండగానే 18 అంగుళాలు మందం కలిగిన అద్దాలు, డిస్‌ప్లే హోర్డింగులు, సీలింగులు ధ్వంసం అయ్యాయి. సమీపంలో కిషోర్ సినిమా థియేటర్, అన్నపూర్ణ థియేటర్ అద్దాలు పగిలిపోయాయి. లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. పేలుడు ధాటికి పలు భవనాలు కంపించడంతో భూకంపం ఏమైనా వచ్చిందా అనే భయంతో ప్రజలు ఆందోళన చెందారు. రోడ్లపైకి చేరుకున్నారు. బాణసంచా పేలుడు నిర్వాహంచిన ఊపిరి పీల్చుకున్నారు. పేలుడు ధాటికి పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకుని వెళ్లిపోయినట్టు వైద్యులు తెలిపారు.



పేలుడుకు ధ్వంసం అయిన వికాస్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్, సెరా షోరూమ్ అద్దాలు





ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, అధికారులు

అధికారులు, నాయకుల పరిశీలన

పేలుడు జరిగిన ప్రాంతం, సమీపంలో నష్టపోయిన వెంకటరమణ ట్రేడర్స్, వికాస్ కళాశాల ప్రాంతాలను ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్ పరిశీలించారు. రూ.18.20 లక్షలు ఆస్తినష్టం సంభవించినట్టు ఆర్డీవో తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం నష్టపోయిన వారిని పరామర్శించారు. విస్ఫోటనం ధాటికి నష్టపోయిన వెంకటరమణ ట్రేడర్స్, వికాస్ కళాశాల, సినిమా థియేటర్లతో పాటు పలువురు భవనాల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. నష్టానికి కారణమైన ఉత్సవ సెవా కమిటీ సభ్యులను ఆదుపులోకితీసుకుని విచారిస్తున్నామన్నారు. నష్టానికి కారణమైన అంజనేయ ఫైర్‌వర్క్స్ దపులూరి శివ, కమిటీ సభ్యులను ఆదుపులోకితీసుకుని విచారిస్తున్నామన్నారు.

వయసు 33.. కేసులు 69

- 16 ఏళ్ల నుంచే చోరీలు
- అంతర్ జిల్లా దొంగ ఆట కట్టించిన తూర్పు గోదావరి జిల్లా పోలీసులు
- 630 గ్రాముల బంగారు, 4కిలోల వెండి, సుమారు రూ.లక్ష నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చిన్న వయసు నుంచే చోరీల బాట పట్టాడు. ఆ సొమ్ముతో విలాసాలకు అలవాటు పడ్డాడు. ఎన్ని సార్లు జైలుకు వెళ్లొచ్చినా మార్పు రాలేదు. దొంగతనం చేయడం.. పట్టుబడితే జైలుకు వెళ్లడం. తిరిగి రావడంతోనే మళ్లీ చోరీలు చేయడం.. ఇదే ఆతడికి దైనందిన జీవనంగా మారిపోయింది. దీంతో 33ఏళ్లకే 69 కేసులు నమోదయ్యాయి. ఉండ్రాజవరానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు పోలీసులు ఆ దొంగ ఆట కట్టించారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్ వివరాలను వెల్లడించారు. భీమవరం టౌన్ పరిధిలోని గునుపూడికి చెందిన వందిరి వెంకట నారాయణ ప్రస్తుతం ఏలేశ్వరంలో ఉంటూ ఒక మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తల్లిదండ్రులు కూలీలుగా జీవనాన్ని నెట్టుకొస్తున్నారు. అన్నయ్య ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నారాయణ మాత్రం చిన్నతనం నుంచే విలాసాలకు అలవాటుపడి సొమ్ముల కోసం దొంగతనాల బాట పట్టాడు. తన కు 16ఏళ్ల వయసు ఉండగా 2008లో భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇనుప ముక్కలు, సైకిళ్ల దొంగతనం చేస్తూ మొదటిసారి పోలీసులకు పట్టుబడి జువైనల్ హోంకు వెళ్లొచ్చాడు. తర్వాత అవనిగడ్డకు చెందిన ఎలమంచిలి కృష్ణతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. భీమవరం పోలీసులు పట్టుకుని మళ్లీ జువైనల్ హోంకి తరలించారు. ఆక్కడి నుంచి బయటకు వచ్చిన తర్వాత 2014 నుంచి ఇళ్లలో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. జైలులో పరిచయం అయిన హైదరాబాద్‌కు చెందిన మంచం శ్రీనివాస్‌తో కలిసి అమలాపురం, పిఠాపురం, వీరవాసరం, ఆచంట, ఐరగవరం, పెనుగొండ, పెనుమంట్ర పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేశాడు. దొంగతనాలు చేయడం కోసం ప్రత్యేకంగా ఇనుప రాడ్‌లను తయారు చేయించుకున్నాడు. గతేడాది అక్టోబరు 22న అలమూరు పోలీసులు జైలుకు పంపారు. నవంబరు 23న జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ నాలుగు నెలల్లో ఉండ్రాజవరంలో 3, సమిశ్రగూడెం 3, పెనుమంట్ర 2, ఆయినవిల్లి, పెరవలి, రావులపాలెం, భీమడోలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క చొప్పున 12 ఇళ్లను దోచేశాడు. ఈ క్రమంలో గత నెల 11న ఉండ్రాజవరానికి చెందిన సీపాని విజయలక్ష్మి తన ఇంట్లో దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో నారాయణను నిందితుడిగా గుర్తించి ఈ నెల 8న ఉండ్రాజవరంలో అరెస్టు చేశారు. ఇతడిపై ఇటీవల నమోదైన 12 కేసుల్లో 630గ్రాముల బంగారు ఆభరణాలు, 4కిలోల వెండి వస్తువులు, సుమారు రూ.1లక్ష నగదు, టీవీ, మోటార్ సైకిల్, నేరానికి ఉపయోగించే స్క్రూడ్రైవర్లు, ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. చోరీ సొత్తును ముత్తూట్ వంటి ఫైనాన్స్ కంపెనీల్లో కుదువ పెట్టి ఆ డబ్బులతో క్రికెట్ బెట్టింగ్ ఆడడంతోపాటు విలాసాలకు ఖర్చు చేసేవాడని తెలిపారు. గతంలో నారాయణపై 57 కేసులు ఉన్నాయని, వాటిలో రెండు తీవ్రమైన నేరాలు ఉన్నాయని చెప్పారు. అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎల్.అర్జున్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, క్రూస్ టీం సీఐ నర్సింహ్, ఉండ్రాజవరం, సమిశ్రగూడెం ఎస్‌ఐలు జక్రీనివాసరావు, కె.వీరబాబు, సీసీఎస్ ఎస్‌ఐ రవీంద్ర, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

రైళ్లలో దొంగతనాలు

యువకుడి అరెస్ట్

రూ.3.70 లక్షల సొత్తు స్వాధీనం

నిడదవోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్ట్ చేసి బంగారం, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని భీమవరం రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమరాజు తెలిపారు. బుధవారం నిడదవోలు రైల్వే పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సోమరాజు మాట్లాడుతూ రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నిడదవోలు మండలం శింగవరం గ్రామానికి చెందిన ఉలవలపూడి దుర్గారావు బుధవారం ఉదయం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుంటే అరెస్ట్ చేశామన్నారు. అతడిని విచారించి వివిధ కేసులకు సంబంధించి 30 గ్రాముల బంగారం, 18 సెల్ ఫోన్లు, సుమారు రూ.3లక్షల 70 వేల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఐ పి.అప్పారావు, సిబ్బంది ఉన్నారు.



నిడదవోలులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ

సీటీఎస్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని వివిధ వర్గాలకు చెందిన శిక్షణ పొందిన సభ్యుల నుంచి క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ ట్రైనింగ్ అయిన అర్హులైన వారి నుంచి ప్రైవేట్ అభ్యర్థులుగా ఏఐటీటీ 2025 ఆండర్ (సీటీఎస్) పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ డైరెక్టర్ కోరుతున్నారు. ప్రైవేట్‌గా ఐటీఐ ఆలిండియా ట్రేడ్ పరీక్ష రాసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో అందజేయాలని కన్వీనర్ జీవీ జుగోపాలేశ్వర్ కోరారు. ఏడేళ్ల తర్వాత ఈ అవకాశం కల్పిస్తున్నామని, మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ 9701215511 నెంబరును సంప్రదించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

డెల్టాకు రబీ నీటి విడుదల నిలిపివేత

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్

మోతుగూడెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలోని రబీ పంటలకు సీలేరు నుంచి నీటి విడుదల నిలిపివేసినట్టు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. సీలేరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫిబ్రవరి 10 నుంచి డొంకరాయి జలాశయంలో విద్యుదుత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. జల వనరుల శాఖాధికారుల సూచనమేరకు మంగళవారం నుంచి నీటి విడుదల నిలిపివేశామన్నారు. ఇప్పటివరకు గోదావరి డెల్టాకు డొంకరాయి జలాశయం నుంచి 15టీఎంసీల నీటిని విడుదల చేశామని, ప్రస్తుతం పవర్ కెనాల్ ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం 4300క్యూసెక్కులు వెళ్తోందని తెలిపారు. ఉమ్మడి నిర్వహణలోని బలిమెల, డొంకరాయి జలాశయాల్లో 48.000 50టీఎంసీల నీటి నిల్వలున్నాయని, వర్షాకాలం వరకు విద్యుదుత్పత్తికి డోకా ఉండదని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న సునీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందడంలో ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధత కలిగి బాధ్యతల్ని నిర్వర్తించాలని, ఆయా వర్గాలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. బుధవారం రాజమహేంద్రవరంలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వివిధవర్గాలకు సామాజిక సాధికారత పథకాల అమలుపై సమన్వయ శాఖల అధికారులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీజే మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రారంభించి వాటిని అర్హులకు అందే విధంగా వారిని చైతన్యవంతం చేయాలన్నారు. నిరుపేదలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతోందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది కూడా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలపై కార్యాలయాలు నిర్వహించిన పథకాల పట్ల అవగాహన కల్పించడం సూచించారు. అంగన్వాడీ వర్కర్లతో మమేకం కావడం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎం.గాయత్రి దేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, లీగల్ ఎయిడ్ డిప్యూటీ చీఫ్ డీఎం ఆర్.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

400 కిలోల జీడిపప్పు.. మాడి బొగ్గాయే



విద్యుత్ సమస్యతో మాడి బొగ్గు అయిన జీడిపప్పు

మలికిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరం సబ్‌స్టేషన్ వద్ద బ్రేకర్ లింక్ వారం రోజుల క్రితం కాలిపోయింది. అధికారులు సరిగా స్పందించకపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. నరుకుట్లు చర్యల్లో భాగంగా మలికిపురం సబ్‌స్టేషన్ విద్యుత్‌తో అనుసంధానం చేశారు. మోరి, మోరిపోడులలో 12 జీడిపప్పు ఫ్యాక్టరీలు ఉన్నాయి. మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో అధికారులు సరిగా స్పందించలేదు. విద్యుత్ ఒక ఫేస్ కాలిపోయి, రెండు ఫేస్‌లలో విద్యుత్ రావడం, దీనికి తోడు హై ఓల్టేజ్ రావడంతో పలు జీడిపప్పు ఫ్యాక్టరీల్లో మోటార్లు కాలిపోగా ముప్పర్తి సుబ్బారావుకు చెందిన జీడిపప్పు ఫ్యాక్టరీలో 400కిలోల జీడిపప్పు మాడి బొగ్గు అయిపోయింది. రూ.4లక్షల నష్టం వాటిల్లినట్టు ఫ్యాక్టరీ యజమాని తెలిపారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ ఏఈఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. తరచూ అంతరాయం లేకుండా న్యాయమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి ఆలీసు గంగాదేవి, టీడీపీ సమితి మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, జనసేన నేత బళ్ల రామ డిమాండ్ చేశారు.

270 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్



నిందితుడి వివరాలు తెలుపుతున్న ఎస్పీ

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు 270కిలోల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ వివరాలను బుధవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ రాజమహేంద్రవరంలో వెల్లడించారు. హరియాణాలోని సోనిపట్ గ్రామానికి చెందిన మోను సైని లారీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఎన్ఎల్ 01 ఏజీ 6162 నెంబరు కలిగిన కంటెయినర్ లారీలో విశాఖపట్నానికి ఫైవుడ్ లోడు వేసుకుని వచ్చాడు. తిరుగుప్రయాణంలో నర్సీపట్నం ప్రాంతం నుంచి మరో వ్యక్తి అందజేసిన గంజాయి ప్యాకెట్లను డ్రైవరు క్యాబిన్ పైన ఉన్న మరో క్యాబిన్‌లో వేసుకున్నాడు. ఈగల్ బృందానికి వచ్చిన సమాచారంతో బొమ్మూరు పోలీసులను అప్రమత్తం చేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు సీఐ పి.కాశీవిశ్వనాథం నేతృత్వంలో వాహన తనిఖీలు చేపట్టారు. సదరు లారీని ఆపి తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం రూ.13.50లక్షల విలువ చేసే 270కిలోల గంజాయి, లారీని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. లారీలోని ఆదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి సందీప్‌కర్ల ఆమోశ్ కోసం గాలిస్తున్నామన్నారు. గంజాయికి సంబంధించి ఎలాంటి సమాచారమైనా పోలీసులకు తెలియజేయాలని, 1128 ఫోన్‌లో కూడా సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. ఆలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, రివార్డు అందిస్తామన్నారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ బివిద్య, సీఐ కాశీ విశ్వనాథం, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

యానాం ఎమ్మెల్యే ఫొటోతో పోస్టులు

మహిళలను మోసం చేసిన రాజమండ్రి యువకుడి అరెస్ట్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యానాం ఎమ్మెల్యే ఫొటోను సామాజిక మాధ్యమాల్లో డీపీగా పెట్టుకుని మహిళలను మోసం చేసిన కేసులో రాజమహేంద్రవరానికి చెందిన ఓ యువకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన జోగాడ వంశీ కృష్ణ, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ గతంలో ఒకే కళాశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం వంశీ హైదరాబాద్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని తెలుస్తోంది. అతడి సోషల్ మీడియా ప్రొఫైల్ పిక్చర్‌గా ఎమ్మెల్యే ఫొటోను పెట్టుకోవడంతో పాటు అతడితో సాన్నిహిత్యంగా ఉన్నట్టు ఫొటోకాపీలతో పలు వివాహ సంబంధిత ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో పోస్టులు పెడుతున్నాడు. అలా మోసపోయిన ఓ మహిళ ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం వంశీని అరెస్టు చేశారు. 4రాష్ట్రాల్లో సుమారు 26మంది మహిళలను మాయ మాటలతో నమ్మించి మోసం చేశాడని పోలీసు ప్రాథమిక విచారణలో తేలినట్టు సమాచారం.

మనుమరాలే మోసం చేసింది!

వృద్ధురాలి బంగారం అపహరణ కేసులో మనుమరాలు, మునిమనుమరాలు అరెస్టు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి కళ్లల్లో కారంకొట్టి బంగారం అపహరించిన కేసును పోలీసులు చేధించారు. మనుమరాలు, మునిమనుమరాలు ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించి అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం అర్బననగర్‌లో ఒంటరిగా ఆదెంకుటున్న మండా హైమావతి (72) కళ్లల్లో కారం కొట్టి ఆమె చేతికి ఉన్న రెండు బంగారం గాజులను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా లాక్కుని వెళ్లిపోయిన ఘటనపై ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాకినాడ సీసీఎస్, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ నెల 6వ తేదీ ధర్మ జరిగిన దొంగతనంపై నమోదు చేసిన కేసుపై విచారణను వేగవంతం చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, సీసీఎస్ సీఐ కృష్ణ పర్యవేక్షణలో విచారణ చేయగా వృద్ధురాలి మనుమరాలైన చెల్లూరు దుర్గాభవాని, ఆమె కుమార్తె కలిసి నేరం దొంగతనం చేసినట్టుగా రుజువైంది. దీంతో వాళ్లిద్దరినీ అరెస్టు చేసి దర్యాప్తు నిమిత్తం బంగారం గాజులను స్వాధీనం చేసుకుని భవానిని రిమాండ్‌కు పంపారు. బాలికను విశాఖపట్నంలోని బాలిక వసతిగృహానికి పంపించినట్టు ఎస్ఐ తెలిపారు.

రెట్టింపు పెట్టుబడి పేరిట దోపిడీ

ఆన్‌లైన్‌లో రూ.8.68 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆండ్రాయిడ్ ఫోను టెలిగ్రామ్‌కు వచ్చిన ఒక లింక్ క్లిక్ చేస్తే మీపెట్టుబడికి రెట్టింపు డబ్బులు వస్తాయని వచ్చిన సందేశాన్ని నమ్మిన ఒక వ్యక్తి ఏటు దఫాలుగా రూ.8లక్షల 68వేలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో మల్లయ్యపేటలో జరిగింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. మల్లయ్యపేటకు చెందిన కేశనకుర్తి వెంకటేశ్వరరావు ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో ఆతనికి గత నెల 27న తన ఫోన్‌లో టెలిగ్రామ్‌కు ఒక లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేస్తే మీ పెట్టుబడికి రెట్టింపు నగదు వస్తుందని సందేశం రావడంతో దానిని నమ్మిన వెంకటేశ్వరరావు తొలుత రూ.40 పెట్టుబడి పెట్టాడు. దానికి రెట్టింపు నగదు వచ్చింది. దీంతో అప్పట్నుంచి డబ్బులు పెట్టుబడి పెట్టుకుంటూ వచ్చాడు. చివరికి ఆతడు రూ.8లక్షల 68 వేలు పెట్టుబడి పెట్టి తనకు రావాల్సిన డబ్బుల ఆకౌంట్‌కు బదిలీచేయాలని ఆన్‌లైన్‌లో సందేశం పంపాడు. దానికి అవతలి మోసగాళ్లు ఇంకా రూ.4లక్షలు పెట్టుబడి పెడితే మొత్తం నగదు బదిలీ చేస్తామని అనడంతో అనుమానంవచ్చి బాధితుడు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీరు బాటిల్స్‌తో దాడి చేసిన ముగ్గురి అరెస్ట్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బీరు బాటిల్స్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు సర్పవరం ఎస్ఐ పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. కాకినాడ అర్బన్ కొత్త గైగోలుపాడుకు చెందిన పలివి రమేష్, దాసరి రాజు, తిమ్మాపురం గ్రామం రాయుడుపాలెం సెంటర్‌కు చెందిన గంజా దుర్గాప్రసాద్ కలిసి ఈ నెల 1న తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పాత గైగోలుపాడు పెంకేవారికాలనీలో మద్యం తాగేందుకు వచ్చారు. అక్కడకు మరో ఇద్దరు వచ్చారు. అప్పుడు ఏర్పడిన చిన్నపాటి వివాదం దాడికి దారితీసింది. నిందితులు ఉద్దేశపూర్వకంగా బాధితులపై బీర్ బాటిల్స్‌తో దాడి చేసి తీవ్ర రక్తస్రావం అయ్యేలా చేశారు. బాధితుల ఫిర్యాదుతో సీఐ బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. ముగ్గురు నిందితులు ఉద్దేశపూర్వకంగానే హింసాత్మక దాడికి పాల్పడినట్టు దర్యాప్తులో తేలిందని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మూడో నిందితుడు పరారీలోఉన్నట్టు ఎస్ఐ చెప్పారు.

మద్యం తాగి విధులకు హాజరు...

అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ గార్డుల తొలగింపు

అన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి విధులకు హాజరైన అన్నవరం దేవస్థానం ఇద్దరు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తప్పించారు. భద్రతా చర్యల కట్టుదిట్టంలో భాగంగా సెక్యూరిటీ గార్డులకు విధులకు హాజరయ్యే సమయంలో బ్రీత్‌ఎనలైజర్ టెస్టులు చేయగా బుధవారం ఇద్దరు పట్టుబడ్డారు. ఇటీవల దేవస్థానం ట్రాన్స్‌పోర్ట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఈ విధంగా పట్టుబడగా ఆతడిపై చర్యలు తీసుకున్నారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

రాజానగరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నామవరం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాటిలైటిసిటీకి చెందిన మల్లపాటి సుధీర్ (23) మృతి చెందాడని రాజానగరం సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం.. కాటిలైటిసిటీ నుంచి నామవరం వైపు బైకుపై వెళ్తున్న సుధీర్‌ను కాటిలైటిసిటీ వైపునకు వస్తున్న మరో వ్యక్తి బైక్ ఢీకొనడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

రైలు నుంచి జారి పడి...



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ

తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. ఇళ్లిపాడు- నర్సీపట్నం రోడ్డు స్టేషన్ల మధ్య (ప్రమాదవశాత్తూ రైలు నుంచి 45 ఏళ్ల వ్యక్తి జారిపడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఏ ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచినట్టు ఎస్ఐ జక్రీనివాస్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు తుని రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

నల్లజర్ల మండలంలో... దారుణం!

- బాలబాలికలను లైంగికంగా వేధిస్తున్న వృద్ధుడు
- పోక్సో నమోదు.. పోలీసుల అదుపులో నిందితుడు
- కామాంధుడికి హెచ్ఐవీ ఉండడంతో తల్లిదండ్రుల ఆందోళన

నల్లజర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆనలే వృద్ధుడు.. పైగా హెచ్ఐవీ బాధితుడు. ముక్కుపచ్చలారని బడి పిల్లలపై లైంగిక చర్యలతో వేధించాడు. చాక్లెట్లు, బిస్కెట్లు ఎరచూపి వారితో జుగుప్సాకరమైన రీతిలో ప్రవర్తించాడు. విషయం బయటకు రావడంతో పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని ఓ గ్రామంలో అరవై ఏళ్ల వృద్ధుడికి హెచ్ఐవీ ఉంది. పాఠశాలలో నాలుగైదు తరగతులు చదువు కుంటున్న బాలబాలికలు పాఠశాల విడిచిన తర్వాత పక్కనే ఖాళీ స్థలంలో ఆడుకునేవారు. వారి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లేవారు కావడంతో వారు వచ్చేదాకా అక్కడే పిల్లలంతా కాలక్షేపం చేసేవారు. ఇదే అదనుగా నిందితుడు అక్కడి పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి మచ్చిక చేసుకుని సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలోకి తీసుకెళ్లేవాడు. ఏడు ఎనిమిది పాటు కొంతమంది బాలురకు కూడా తీసుకెళ్లడంతో ఆ విషయం ఒక బాలుడు తన తల్లికి చెప్పాడు. కానీ పిల్లల కుటుంబాల పరువుపోతుందనే మౌనం వహించారు. ఈ విషయాన్ని బహిర్గతం చేయడానికి ముందుకు రాలేదు. ఇటీవల ఆ కాలనీలో ఒక బాల్య వివాహం ఆపడానికి ఐసీడీఎస్ సిబ్బంది వెళ్లడంతో ఆ ప్రాంత ఆశ కార్యకర్త ఈ విషయాన్ని వారితో ప్రస్తావించారు. దీనికి మంగళవారం ఐదుగురు తల్లులు తమ పిల్లలను తీసుకుని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి సహాయంతో సీఐ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన తల్లులను, పిల్లలను విడివిడిగా జరిగిన విషయాన్ని ఆడిగి తెలుసుకున్నారు. బుధవారం తొమ్మిది మంది బాలబాలికలకు వైద్య పరీక్షలు చేయించారు. రిపోర్టు రావాల్సి ఉంది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు సీఐ రాంబాబు పేర్కొన్నారు. దేశ వయసున్న ముగ్గురు బాలురు, ఐదుగురు బాలికలను మచ్చిక చేసుకుని అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఇది గత నెల రోజులుగా జరుగుతున్నా వారంతా భయంతో ఎక్కడా నోరు విప్పలేదు. కానీ బాలికలతో

పాస్టర్ ప్రవీణ్ మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు కొనసాగుతుందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఇతర కేసులపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతికి సంబంధించి వివిధ ఏజెన్సీలతో కలిసి ఫోరెన్సిక్ రిపోర్టుకు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ తదితర నివేదికలు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఎవరి దగ్గరైనా ఏమైనా ఆధారాలుంటే పోలీసులకు సమర్పించాలని సూచించారు. వారు చెప్పే విషయాలు ఆధార సహితంగా ఉండాలని, వదంతులను ఆధారంగా తీసుకుని ప్రకటనలు చేయలేమన్నారు. సోషల్ మీడియాలో లేదా బహిరంగంగా, ఆవాస్తవాలను ఏవైనా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమలాపురం

ఉపాధ్యాయులకు బొబ్బట్లు పంపిణీ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు ఎస్టీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం బొబ్బట్లు పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో ఈ పంపిణీ జరిగింది. ఎస్టీయూ జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

కార్యదర్శి ఆదిశంకరం బాధ్యతల స్వీకరణ

అల్లవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా ఎన్.ఆదిశంకరం బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన భట్నవిల్లి పంచాయతీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సింగంపల్లి దుర్గాశ్రీనివాస్ డీపీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎంపీడీవో కృష్ణమోహన్‌ను ఆయన కలిశారు.

గ్రోయిన్స్ నిర్మాణానికి రూ.320కోట్లతో ప్రతిపాదనలు

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజకవర్గంలోని మూడు మండలాలు గోదావరి తీరం వెంబడి ఉన్నాయని, ప్రతి ఏడాది వరదలకు వందల ఎకరాలు భూమి నదీ పాతం అవుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నదికోతకు అడ్డుకట్ట వేయడానికి రూ.320కోట్లతో గ్రోయిన్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. నిధులు కోసం అవసరమైతే కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఆశ్రయిస్తామన్నారు. పి.గన్నవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమీక్షాసమావేశలోఆయన మాట్లాడారు. సాగునీటి పంపిణీకి ఇబ్బందులు కలిగిస్తున్న ప్రదేశాలను గుర్తించి కాల్వవిరామ సమయంలో పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. నియోజకవర్గం పరిధిలో పూడికతీత, పలు పనులు కోసం రూ.3కోట్లతో ప్రతిపాదనలు పం పినట్టు తెలిపారు. పలివెల లాకులు దిగువున రైతులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పి.గన్నవరం రవాణాకు ఇబ్బంది కలిగించే ఆక్రమణలు తొలగించాలని అధికారులకు సూచించారు. ఆక్రమణదారులకు సమాచారం ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డ్రైన్స్ ఈఈ ఎంవీవీ కిషోర్, డీఈఈ ఆర్.నాగార్జునరావు, ఇరిగేషన్ డీఈ ఆర్.నాగేంద్రకుమార్, ఏఈలు నవీన్‌కు మార్, సుందర్‌సింగ్, పవన్ కుమార్, ఆనంద్‌కిరణ్, టి.మూర్తి, ప్రసాద్‌బాబు, దుర్గానాయుడు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, నీటి సంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధిపై సీఎంకు ప్రతిపాదనలు



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి వివరించినట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. మలికిపురం సెంటర్ విశ్వేశ్వరాయపురం వంతెన నుంచి వేంకటేశ్వరస్వామి గుడి వరకు డబుల్ రోడ్డు సెంట్రల్ డివైడర్ లైటింగ్‌తో వేయడానికి, సఖినేటిపల్లిలంక బోను దగ్గర నుంచి అంతర్వేది గుడి వరకు 12 కిలోమీటర్ల డబుల్ రోడ్డు, అంతర్వేదిపాలెం నుంచి కేశవదాసుపాలెం 3.4 కిలోమీటర్ల డబుల్ రోడ్డు గురించి ప్రతిపాదనలు అందజేశానన్నారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానానికి సరైన రోడ్డు సదుపాయం కల్పించడానికి రూ.50కోట్లతో ఈమూడు రోడ్ల ప్రతిపాదనలు తయారుచేసి ముఖ్యమంత్రికి అందజేశానన్నారు. ఈప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారని ఎమ్మెల్యే తెలిపారు.

మలేరియా నిర్మూలనకు అవగాహన అవసరం



మలేరియా వ్యాధి నిర్మూలనకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు

అంతర్వేది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో భాగంగా ఆరోగ్య కేంద్రాల వద్ద నిర్వహించిన మలేరియా వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. సీజనల్ జ్వరాలపె జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. జ్వరం వచ్చిన ప్రతీ ఒక్కరికీ మలేరియా పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ప్రతీ నివాస గృహం వద్ద నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో భాగస్వామ్యం అవ్వాలని, దోమల నివారణకు అందరూ సహకరించాలని, ఇందుకు సంబంధించి పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, సిబ్బందికి సూచలనిచ్చారు. ల్యాబ్‌ను పరిశీలించి టెక్నీషియన్లు, ల్యాబ్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పీజే గాయత్రి, డాక్టర్ సీహెచ్ దుర్గాకావ్య, వైద్యాధికారులు ఎం.రాజశేఖర్, యూనిట్ ఆఫీసర్ టి.విజయ, పీఎల్ఎన్ స్వామి, ఎ.సరస్వతి, పీబీ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులు

యానాం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యానాం శివారు గిరియాంపేటలోని పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్, గౌరవ అతిథిగా పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు మాట్లాడారు. విద్యాభివృద్ధిలో తలిదండ్రుల పాత్రను వివరించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్‌వీ శ్రీరాం, అప్పరావు, చంద్రశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఇటీవల పాఠశాల 5వ తరగతి విద్యార్థి తిరుమాడి విశాలమర్మ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చి విద్యాశాధికారి రూ.25వేలు, విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు రూ.10వేలు అందజేశారు.

సాయిబాబాకు అలంకరణ



ముమ్మిడివరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ శ్రీసాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల7న ప్రారంభమైన వార్షికోత్సవంలో సోమవారం, మంగళవారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం బాబాకు కాకడ హారతి, పంచామృతాభిషేకం, పుష్పాలు, పత్రాలతో విశిష్ట పూజలు, సాయివ్రతాలు, అన్నసమరాధన నిర్వహించారు. మధ్యాహ్న హారతి, సంధ్యా హారతి, శేజ్‌హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

'చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించాలి'

అంబాజీపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వక్కలంక గ్రామంలో ఉన్న ప్రధాన చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించాలని రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. గ్రామంలో ఎనిమిది ఎకరాల గ్రామకంఠం చెరువు ఉందని,ఈచెరువును 343 జీవో ప్రకారం గ్రామంలోని రజక సంఘానికి 3ఎకరాలు, 5ఎకరాలు కలిపి ప్రభుత్వం కేటాయించింది. ఈచెరువు ద్వారా రజక సంఘం, మత్స్యసంఘం ద్వారా పంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన కొంత మంది చెరువు ఉత్తరం, ఈశన్యం వైపున ఎకరం చెరువును ఆక్రమించుకుని ఇళ్లు, కమ్యూనిటీ భవనం నిర్మించుకున్నారని వివరించారు. చెరువుగట్టు వద్ద అమ్మవారి ఆలయాన్ని నిర్మించేందుకు బుధవారం కొబ్బరిచెట్లను తొలగించారు. దీంతో రజక సంఘ నాయకులు చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించడంతో పాటు అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు నిలిపివేయా లని కలెక్టర్‌తో పాటు ఎంపీడీవో, తహశీల్దారు, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గొల్లపల్లి ధర్మారావు, రజక సంఘం మండల అధ్యక్షుడు నేదునూరి కళ్యాణ్, అధికారపు బాబ్జి, నేదునూరి సూర్యవెంకటరమణ, కమిడి అబ్బు, ముక్కామల ముత్యాలు, సామంతకుర్తి ఈశ్వరరావు వినతిపత్రాలు అందించిన వారిలో ఉన్నారు.

చల్లపల్లి ప్రాజెక్టు పరిధిలో తాగునీటికి కటకట

- గ్రామాలకు సక్రమంగా అందని తాగునీరు
- పంపింగ్‌లో వైఫల్యమే కారణమంటున్న ప్రజలు
- పవర్ ఇక్కట్లే కారణమంటున్న అధికారులు
- జనరేటర్‌కు నోచుకోని చల్లపల్లి ప్రాజెక్టు





చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు స్టోరేజ్ ట్యాంక్, రన్నింగ్‌లో ఉన్న రెండు పంపింగ్ మోటార్లు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఏ గ్రామానికి ఎప్పుడు తాగునీరు వస్తుందో తెలియదు. నాలుగు రోజుల వరకు నీరు రాకపోయినా ఎదురు చూడాల్సిందే. ఇలా ఎందుకు జరుగుతోందని అడిగితే విద్యుత్‌పై నెపం నెట్టేసి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తప్పించుకుంటున్నారు. వేసవి ప్రారంభంలోనే చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పంపింగ్‌లో మోటార్ల వైఫల్యం ఒక కారణమైతే, తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం మరో కారణం. వెరసి పంపింగ్ సక్రమంగా లేక కొన్ని గ్రామాల ఓవర్ హెడ్ ట్యాంకులకు రోజుల తరబడి నీరు ఎక్కడం లేదు. చల్లపల్లి ప్రాజెక్టు ద్వారా నిత్యం 15,10,000 లీటర్ల నీరు పంపింగ్ జరగాలి. ఆయా గ్రామాల్లో దాదాపు 36 ట్యాంకులకు ఈనీరు పంపించాలి. పదిహేను రోజులుగా విద్యుత్ సరఫరాలో రోజుకు పది సార్లు అంతరాయం ఏర్పడి పంపింగ్‌కు అడ్డంకి ఏర్పడుతోంది. ఒకసారి సరఫరాలో పది నిమిషాలు అంతరాయమేర్పడితే అనంతరం పంపింగ్ ప్రారంభమైనా అప్పటికే పైప్‌లైన్‌లో నీరు ఖాళీ కావడంతో అవి పూర్తిగా నిండిన అనంతరమే ట్యాంకులకు నీరు చేరుతుంది. ఇలా పంపింగ్‌లో అవరోధాలతో ప్రతి రోజు కొన్ని గ్రామాల ప్రజలకు తాగునీటి వ్యధలు తప్పడం లేదు. ప్రతి రోజూ నిరాటంకంగా 18గంటలు పంపింగ్ జరిగితే పంచాయతీ ట్యాంకులకు పూర్తిస్థాయిలో నీరు ఎక్కుతుంది. పంపింగ్‌కు నిత్యం రెండు మోటార్లు పనిచెయ్యాలి. ఈరెండింటిలో ఏదైనా పాడైతే వెంటనే స్పేర్ మోటార్‌ను వినియోగించుకోవాలి. పాడైన మోటార్‌ను వెంటనే బాగుచేయించి సిద్ధంగా ఉంచుకోవాలి. పాడైన మోటార్ మరమ్మతులను నిర్లక్ష్యం చేయడం వల్ల ఉన్న రెండింటిలో ఒకటి పాడైతే ఒక్కదానితోనే పంపింగ్ నెట్టుకొస్తున్న సందర్భాలు ఉంటున్నాయి. ఈప్రాజెక్టులో నాలుగు ఫిల్టర్ బెడ్‌లున్నాయి. వీటిలో మూడు వినియోగంలో ఉంటే ఒకటి ఖాళీగా ఉంటుంది. మూడింటిలో ఒకటి పాడైతే నాల్గవ ఫిల్టర్‌ను వినియోగంలోకి తెస్తారు. అయితే ప్రస్తుతం రెండు ఫిల్టర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇక ఫిల్టర్లకు నీటి పంపింగ్ మోటార్ల విషయంలోనూ ఇదే పద్ధతి పాటిస్తున్నట్టు సమాచారం. పంపింగ్‌లో అవరోధాలతో చాలా గ్రామాలకు నీటి సరఫరా తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటికే గ్రామాల్లో రోజుల తరబడి తాగునీరందక ప్రజలు పంచాయతీ సిబ్బందిని నిలదీస్తున్నారు. విద్యుత్ అంతరాయాన్ని బూచిగా చూపించి అధికారులు తప్పించుకుంటున్నారే తప్ప అసలు కారణాలను బహిర్గతం చేయడం లేదు. వేసవి తాపం మొదలైనా ప్రాజెక్టు వద్ద జనరేటర్ ఏర్పాటు చెయ్యలేదు. ముందు ముందు విద్యుత్ అంతరాయాలు మరింత ప్రబలమైతే పరిస్థితి ఏమిటి? ఎప్పుడైనా పంపింగ్‌లో అంతరాయమేర్పడినా, మెయిన్ పైప్‌లైన్ ఎక్కడైనా దెబ్బతిన్నా ఒక రోజు కొన్ని గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోవడం సాధారణమే. వరుసగా కొన్ని ట్యాంకులకు రోజుల తరబడి సరఫరా ఎందుకు ఆగిపోతోంది? మోటార్ల పంపింగ్ సామర్థ్యం తగ్గిందా? ఫిల్టర్లకు పూర్తి స్థాయిలో నీరందించలేక పోతున్నారా? మూడు మోటార్లు సిద్ధంగా ఉంటే ఒక కనెక్షన్‌ను ఎందుకు డమ్మీ చేశారు. ఒక మోటారు చెడిపోయినప్పుడు స్పేర్ మోటార్‌ను అమర్చేందుకు సమయం పడుతుంది గదా! అలాంటప్పుడు మూడు మోటార్లు అమర్చి సిద్ధంగా ఉంచాలి కదా! స్పేర్ మోటార్‌ను పక్కన పెట్టడం దేనికి సంకేతం! వేసవిని దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రాజెక్టు వద్ద పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులతో పాటు పది గ్రామాల సర్పంచ్‌లు కోరుతున్నారు.

విద్యుత్ అంతరాయం వల్లే సకాలంలో నీరివ్వలేక పోతున్నాం: సురేష్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

రోజూ 18గంటలు నిరంతరాయంగా పంపింగ్ జరిగితే సకాలంలో గ్రామాల్లోని ట్యాంకులకు నీరందుతుంది. రోజుకు పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఈకారణంగా పంపింగ్‌లో జాప్యం జరుగుతోంది. నిత్యం రెండు మోటార్ల ద్వారా పంపింగ్ జరుగుతోంది. వీటిలో ఏదైనా చెడిపోతే అదనపు మోటార్‌ను వినియోగిస్తాం. వేసవిలో జనరేటర్ వినియోగిస్తాం.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పవర్‌టిల్లర్లను రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం, అంబాజీపేట, మామిడికుదురు మండలాల రైతులకు ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావుతో కలిసి పవర్‌టిల్లర్లను ఎమ్మెల్యే అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు.వైసీపీ హయాంలో ధాన్యం కొనుగోలు సొమ్ము వేయ డానికి చాలా జాప్యం చేశారన్నారు. రైతులకు సబ్సిడీతో యంత్రాలను అందించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారులు కళ్యాణ్‌సూర్యకు మార్, సీహెచ్‌డీ విజయ కుమార్, బి.మృదుల, నాయకులు సంసాని పెదిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, శేరు శ్రీనుబాబు, యాండ్ర శ్రీనివాసరావు, అంబటి భూలక్ష్మి, పెచ్చెట్టి వెర్రియ్య, తాటికాయల శ్రీనివాసరావు, ఏఈవోలు, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

జిల్లాలో బెస్ట్ ఏపీవోగా రాజామణి

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో పని దినాల కల్పనలో ఏపీవో రాజామణి ఉప్పలగుప్తం మండలాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపి బెస్ట్ ఏపీవోగా ఉత్తమ పురస్కారం అందుకున్నారని ఎంపీడీవో పీఆర్సీ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఏపీవో పి.వీరబాబు అన్నారు. రాజామణితో పాటు టెక్నికల్‌అసిస్టెంట్ దేవీపార్వతి, సీసీలు రవి, నాగేంద్ర ఇతర మండలాలకు బదిలీ అయిన సందర్భంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, అధికారులు, స్థానిక రైతులు వారిని బుధవారం సత్కరించారు. క్షేత్రసహాయకుల సంఘం అధ్యక్షుడు కె.శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పాలనాధికారి ఎంఎల్ఎన్ మూర్తి, పంచాయతీ కార్యదర్శుల ప్రతినిధి పెట్టా నాగేశ్వరరావు, పెయ్యల శ్రీనివాసరావు, ఎం.ధనలక్ష్మీకుమారి పాల్గొన్నారు.



ఏపీవో, టీఏ, సీసీలను సన్మానిస్తున్న అధికారులు

ఏడీఏను సన్మానించిన చైర్మన్ గుబ్బల

రాజోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజోలు వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ రామ్మోహనరావు పాడేరుకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సోంపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం జరిగిన మండల రివ్యూ సమావేశంలో ఏడీఏ రామ్మోహన్‌ను గోదావరి సెంట్రల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరుమిల్లి భాను, ఏవో మధుకుమార్, సాధనాల నాగేశ్వరరావు, ఆర్బీకే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

కాట్రేనికోన, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమం ద్వారా బడి ఈడు పిల్లలందర్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారికి మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సర్వశిక్షాభియాన్ సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. మొల్లేటిమొగ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జరిగిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. బడిబాట ర్యాలీని గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.వెంకటరమణ, సీఆర్పీలు కొప్పిశెట్టి నాగభూషణం, మంత్రిప్రగడ శ్రీనివాస్, పాము రవికుమార్, గిడ్డి శ్రీనివాస్, హెచ్‌ఎం ఎమ్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

భవిష్యత్‌కు శాస్త్ర సాంకేతిక పరిశోధనలు దోహదం



విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు

ఐ.పోలవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవితకు శాస్త్ర సాంకేతిక పరిశోధనలు ఎంతగానో దోహదపడతాయని గుత్తెనదీవి సాయిరాం విద్యానికేతన్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయిరాం హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు 100 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఎస్ఎల్‌సీలో 150మంది విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. రాష్ట్రంలోనే సాయిరాం స్కూల్‌కు బెస్ట్ అవార్డులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లీడ్ అకడమిక్ కో ఆర్డినేటర్ నాటి ధనరాజు, బొమ్మిడి నాగేంద్రవర్మ, పుల్లైపు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మాగాపు సీతారత్నం, బత్తుల శారద, ఎస్.భూలక్ష్మీదేవి, పి.ప్రశాంతి, ఎ.శిరీష, బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

'మనువాదులకు తగిన బుద్ధి చెబుతాం'

కాట్రేనికోన, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని తాళ్ళరామ్‌పూర్ రామాలయంలో శ్రీరామనవమి రోజున కుంకుమార్చన చేయకుండా గౌడ మహిళలను అడ్డుకోవడంపై స్థానిక గౌడ సఘం నాయకుడు కొండేటి చినబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాము తక్కువ కులస్తులమన్న దృష్టితోనే ఆలయంలోకి రాకుండా నిలువరించారని అన్నారు. దీనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అధికారులు గౌడ మహిళలను మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేయించి, పూజలు చేయించి, ఆగమ శాస్త్ర ప్రకారం చీర, జాకెట్టు, తాంబూలం ఇచ్చి ఇంటి వరకు సాగనంపాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే అగ్రకుల మనువాదులకు తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.

13న అమలాపురంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అంతర్వేది, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల13న అమలాపురంలో కోనసీమ కవితోత్సవం పేరిట శ్రీశ్రీకళావేదిక 147వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తామని సంస్థ అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్ తెలిపారు. శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా అమలాపురంలోని శ్రీకళా గ్రాండ్ రెసిడెన్సిలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. 150మంది కవులు ఈజాతీయ ఈసమ్మేళనంలో పాల్గొంటారన్నారు. కవితాగానం చేసిన కవులందరికీ జ్ఞాపిక, దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ గంటి హరీష్ మాధుర్‌లు హాజరవుతారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా ఉదయభాస్కర్



రాజోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన దేశినీడి ఉదయభాస్కరరావు నియమితులయ్యారు. ఈసందర్భంగా రాజోలులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి పదవికి అవకాశం కల్పించిన ఆలిండియా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు సుఖపాల్‌సింగ్ కైరా, ఉపాధ్యక్షుడు అకిలేష్ శుక్లా, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిళ, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, గిడుగు రుద్రరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, పల్లంరాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు 13న ప్రవేశపరీక్ష

రాజోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఈనెల13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఆదివారం ఉదయం 10నుంచి 12గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2నుంచి 4.30గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్ నుంచి పొందాల న్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్, ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరుకావాలన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

కాట్రేనికోన, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు.ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కిమ్స్ దంత వైద్యుల బృందం విద్యార్థులకుపరీక్షలు నిర్వహించి పేస్ట్‌లు, బ్రష్‌లు పంపిణీ చేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డీవీఎన్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, విద్యాశాఖాధికారిణి ఎస్.జయలక్ష్మి పాల్గొన్నారు.

థియేటర్ తనిఖీ

అంతర్వేది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిపాలెంలోని శంకర థియేటర్‌ను అమలాపురం ఆర్డీవో కె.మాధవి బుధవారం తనిఖీ చేశారు. థియేటర్‌లో సౌకర్యాలను, ఆహార ఉత్పత్తులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే టిక్కెట్లు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో థియేటర్ యాజమాన్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

రాజోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. రాజోలులో నియోజకవర్గం బీజేపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన విజయదుర్గా గార్డెన్స్‌లో బుధవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసంఘ్, జనతాపార్టీ విలీనంతో 1980లో భారతీయ జనతాపార్టీగా రూపాంతరం చెందిందన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు వాడ్రేవు పాపయ్యపంతులును దుశ్శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, రాష్ట్ర నాయకులు వల్లభనేని రవీంద్రబాబు, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, నియోజకవర్గ కోకన్వీనర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, చెంపాటి శివరామకృష్ణంరాజు, చెల్లింగి త్రినాథ్, వడ్లమూడి ప్రకాష్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

రాజోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని గోదావరి సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. శివకోడులో శ్రీమంగెన గంగయ్య కాపు కల్యాణ మండపంలో బుధవారం జరిగిన డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ అప్పారి సూర్యనారాయణ ఉద్యోగవిరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సూర్యనారాయణ విశిష్ట సేవలందించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ డాక్టర్ సూర్యనారాయణ అంకితభావంతో వైద్యసేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో కాండ్రేగుల స్వామి, బత్తుల రాము, కడలి వెంకటరమణారావు, కాండ్రేగుల మణిబాబు, కడలి మోహన్, అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో ఆర్డీవో పూజలు



ఆర్డీవోకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ సత్యనారాయణ

అంతర్వేది, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అమలాపురం ఆర్డీవో కె.మాధవి బుధవారం విచ్చేశారు. ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఆలయ ఏసీ సత్యనారాయణ అందజేశారు.

ఈనెల13,14 తేదీల్లో నక్షత్ర మాలధారణ

అంతర్వేది, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఈనెల13,14 తేదీల్లో భక్తులు స్వామివారి నక్షత్ర మాలధారణ చేపడతారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఈనక్షత్ర మాల దీక్షాధారణ అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దీక్షధారణ ధరించి, మే11న నృసింహ జయంతి రోజున దీక్ష విరమణ చేస్తారన్నారు. దీక్షకు సంబంధించిన పూజా ద్రవ్యాలు గురించి ఆలయ అర్చకులను అడిగి తెలుసుకోవాలని తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

అయినవిల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీలో భాగంగా బుధవారం ఎస్.మూలపొలం గ్రామంలో సర్పంచ్ బొబ్బా ప్రభాత్ అధ్యక్షతన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్.మూలపొలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద అయినవల్లి, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు ఇళ్ల నుంచి చెత్త సేకరించడం, తడి-పొడి చెత్తలను వేరుచేసి వర్మికంపోస్టు తయారు చేయడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో పి.బొజ్జిరాజు, మండలపరిషత్ అభివృద్ధి అధికారి జి.భీమారావు, మండలపంచాయతీ విస్తరణాధికారి వాణికుమారి బెహర, పంచాయతీ కార్యదర్శి కె.రాచంద్రరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ముమ్మిడివరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కొత్తలంక గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. కొత్తలంక కాపులవీధికి చెందిన పసుపులేటి కృష్ణవేణి (45) మంగళవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె కుమారుడు శ్రీహరి బుధవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడం వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.భైరవస్వామి కేసు దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 9849918933, 9177547754కు సమాచారం అందించాలన్నారు.

ఎంపీ హరీష్‌మాధుర్ పరామర్శ

ముమ్మిడివరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అనాతవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు కురసాల శివబాబు కుటుంబ సభ్యులను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ బుధవారం పరామర్శించారు. శివబాబు సోదరి కురసాల సుబ్బలక్ష్మి గత నెల 24న మండపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 26న మృతిచెంది. దీంతో శివబాబు కుటుంబ సభ్యులను ఎంపీ హరీష్‌మాధుర్ పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట నాయకులు చెల్లి అశోక్, మిమ్మితి చిరంజీవి, శీలం వెంకటేశ్వరరావు, వలవల శ్రీను, పేరిచర్ల సురేష్‌రాజు, గోదశి గణేష్, పెయ్యల రమణ, కుంచే శ్రీను, మునుకోటి ఏసుబాబునాయుడు, అందే శ్రీను, మట్టపర్తి ఈశ్వరి, గుబ్బల నాని, రామదాసు నాగబాబు, నక్కా సతీష్, కర్రి మణికంఠ, కర్రి రాజేష్, యల్లమిల్లి శ్రీను ఉన్నారు.

వృత్తి నైపుణ్యంపై దృష్టి సారించాలి

అంబాజీపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వృత్తి నైపుణ్యంపై దృష్టిసారించాలని గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ జిల్లా అధికారి ఎంకే భీమారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఒకేషనల్ కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఒకేషనల్‌కోర్సులో భాగంగా గత నెల 29న జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పరీక్షల్లో 89 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరికి 12రోజులు ఇంటెన్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒకేషనల్ ట్రైనర్స్ జి.తేజస్విని, వైస్టీపెన్ల పర్యవేక్షణలో స్థానికంగా ఉన్న ఎలక్ట్రికల్ రివైండింగ్, టైలరింగ్ షాపుల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎన్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రం హోం సర్వేలో వంద శాతం సాధించిన అల్లవరం

అల్లవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోంలో అల్లవరం మండలం జిల్లాలోనే 100శాతం సర్వే పూర్తిచేసి మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. 35,477 మందిని సర్వే చేయాల్సి ఉండగా 35,477మందిని సర్వే పూర్తిచేసి బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి జిల్లాలో 100శాతం సర్వే పూర్తి చేసినందుకు ఎంపీడీవో బి.కృష్ణమోహన్‌ను, కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా నోడల్ అధికారి ఎస్‌టీవీ రాజేశ్వరరావు అభినందించారు.

క్రీడాకారిణికి అభినందన



అమలాపురం టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ చదరంగ మహిళా టీమ్ చాంపియన్ షిప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్న క్రీడాకారిణి గోలి సంధ్యను అభినందిస్తున్న ఎంపీ గంటి హరీష్‌మాధుర్.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.87లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,87,727 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

కేశవస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి అర్చన నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం స్వామివారికి ప్రత్యేక అర్చన, తులసీపూజ, అమ్మవార్లకు కుంకుమార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర కళాకారుల బృందం ఆధ్వర్యంలో తోలుబొమ్మలాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని విరాళాలు అందించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లు నిర్వహించారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

ఆలమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జొన్నాడలోనున్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని బుధవారం రాత్రి వైభవం నిర్వహించారు. కల్యాణోత్సవాల సందర్భంగా ముందుగా స్వామి, అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు. అనంతరం కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఉంచి హైదరాబాద్‌కు చెందిన గొడవర్తి వీర వెంకట సత్యనారాయణ దంపతులతో పూజలు నిర్వహించగా వేద పండితులు కల్యాణాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ నిర్వాహక కమిటీ చైర్మన్ గొడవర్తి దుర్గాప్రసాద్ అధ్వర్యంలో ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జొన్నాడలో వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

క్రికెట్ పోటీల్లో పినపళ్ల ఈసీ ధర్మాజీ ప్రతిభ



జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న కెప్టెన్ ధర్మాజీ

ఆలమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు డ్రీమ్స్ 2025 పేరిట స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీల్లో కొత్తపేట, అమలాపురం టీమ్‌లు తలపడగా కొత్తపేట టీం విజేతగా నిలిచింది. కొత్తపేట టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన ఆలమూరు మండలం పినపళ్ల ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధర్మాజీ ప్రతిభ కనబరించారు. దీంతో ఈయనకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అందించి అభినందించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన అతన్ని ఈఈ రాజ్‌కుమార్, జేఈ వీరభద్రరావు, పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్, కార్యదర్శి వీర్రాజు తదితరులు అభినందించారు.

మొక్కు చెల్లించేందుకు తిరుమల పయనం

కె.గంగవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుమల వస్తామని వారు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో పామర్రు గ్రామానికి చెందిన కూటమి నాయకులు బుధవారం రాత్రి పామర్రు గ్రామం నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, మాటూరి నాని, తూము రమేష్, పెంకే నాగేశ్వరరావు, ఏడిద నరసింహమూర్తి, నున్న వినయ్ తదితర కూటమి నాయకులు బస్సులో తిరుమల యాత్రకు బయలుదేరి వెళ్లారు.



తిరుమల బయలుదేరిన కూటమి నాయకులు

అహ్మదాబాద్ కాంగ్రెస్ సమావేశానికి కామన హాజరు



అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సమావేశానికి హాజరైన కామన ప్రభాకరరావు తదితరులు

మండపేట, ఏప్రిల్, 9(ఆంధ్రజ్యోతి) గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఏఐసీసీ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు హాజరయ్యారు. రెండు రోజుల నుంచి జరుగుతున్న పార్టీ ప్లీనరీ సమావేశంలో దేశ వ్యాప్తంగా వున్న కాంగ్రెస్ శ్రేణులు హాజరయ్యారని బుధవారం ఆయన తెలిపారు. పార్టీ బలోపేతా నికి సంబంధించి అగ్రనేతల నుంచి పలు సూచనలు, సలహాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. రాష్ట్రం నుంచి తనతోపాటు గిడుగు రుద్రరాజు, కనుమూరి బాపిరాజు తదితరులతో పాటు పలువురు పార్టీ నాయకులు హాజరయ్యారని ఆయన తెలిపారు.



ఏడిద జూనియర్ కళాశాలలో విద్యార్థినికి ఇంటర్ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు ఇంటర్ పుస్తకాలు అందజేత

మండపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఏడిదలో వున్న ఇంటర్ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఉపాధ్యాయులు అందజేశారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం అందించే ఉపకార వేతనం, రూ.5 లక్షలకు పోటీపడాలని ఆయన విద్యార్థినులను కోరారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాబోధన జరుగుతోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన జి.సత్యనారాయణ హెచ్‌ఎం ఎం.వెంకట్రాజు, ఎస్ఎంసీ చైర్మన్ ఎన్.రాజేష్ తదితరులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమావీరేశ్వరస్వామి కల్యాణం

రావులపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివర్పాడులో ఉన్న ఉమావీరేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కిరణ్ ఆధ్వర్యంలో స్వామివారికి ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాతావరణం మార్పుతో రైతుల్లో కలవరం

రాయవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం అర్థరాత్రి వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు కలవరం చెందుతున్నారు. రాయవరం మండలంలో డిసెంబరు మొదటి వారంలో వెదసాగు జరిపిన పొలాల్లో దాళ్వా పంట కోత దశకు రావడంతో రాయవరం, వి.సావరం, వెదురుపాక, పసలపూడి, చెల్లూరు గ్రామాల్లో రైతులు వరి కోతలు మొదలుపెట్టారు. ఇటీవల యంత్రాల ద్వారా వరికోతలు జరుపుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతుల్లో కలవరం మొదలైంది. పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షం కురవడంతో వారిలో ఆందోళన నెలకొంది. వరి కోతలు జరిపిన రైతులు రబీ పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని చెబుతున్నారు. ధాన్యం బస్తాలను పలువురు రైతులు పొలాల్లో ఉంచగా, మరికొందరు ధాన్యం ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. వాతావరణం మార్పులతో ఆరబెట్టిన ధాన్యంపై బరకాలుకప్పి రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి: మండలంలో 14,101 ఎకరాల్లో రబీ పంట సాగు జరగ్గా ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో యంత్రాలతో వరికోతలు చేపడుతున్నారని వ్యవసాయ శాఖ మండల అధికారి కె.ప్రభాకర్ తెలిపారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రైతులు ఈనెల 14వ తేదీ వరకు వరికోతలు వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. వరి పనలను పొలాల్లో వదిపెట్టడం సురక్షితం కాదన్నారు. ఇప్పటికే వరి కోతలు చేపట్టిన రైతులు సురక్షిత ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించాలని ఆయన రైతులకు సూచించారు.





రాయవరంలో ఆరబెట్టిన ధాన్యం. పక్క చిత్రంలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు



ఈతకోటలో యంత్రంతో వరికోతలు నిర్వహిస్తున్న దృశ్యం

వరికోతలు ప్రారంభం

రావులపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో వరి పొలాలు కోతదశకు చేరుకోవడంతో రైతులు నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈతకోటలో బుధవారం యంత్రాలతో నూర్పిడి చేసి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు ఉన్నారు. సాయంత్రం వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బోస్

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శాంతి నగర్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, కౌన్సిలర్లు కోటి శ్రీకన్య, కేతా శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రచారజాత నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ ప్రచారజాత ప్రారంభం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతవార్షికోత్సవాలను పురస్కరించుకుని ప్రచారజాత 5వ రోజు బుధవారం రామచంద్రపురంలో ఏఐటీయూసీ నాయకులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు ప్రారంభించారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు బకాయిపడిన రూ750 కోట్లు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి సత్తిబాబు డిమాండు చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, బీకేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రామచంద్రపురం శాఖా కార్యదర్శి మందపల్లి ప్రేమానందం, వి.రాంబాబు, వి.కృష్ణమూర్తి, మహమ్మద్ బాబ్జి, పి.గురుమూర్తి, డి.రవి, వి.తిరుమలరావు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టపగలే లంక గ్రామాల్లో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక, వీధివారిలంక గ్రామాల్లోని లంక భూముల్లో పట్టపగలే విచ్చలవిడిగా మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఇటీవల కేదార్లంకలో గోదావరినది సమీపంలో ప్రొక్లైనర్‌తో మట్టి తవ్వకాలు జరుపుతుండగా ఇదేమిటని ప్రశ్నించిన ఆంధ్రజ్యోతిని చూసి అక్కడి నుంచి ప్రొక్లైనర్‌తో జారుకున్నారు. అప్పటికే అక్కడ చాలా లోతుగా మట్టి తవ్వకాలు నిర్వహించారు. అలాగే వీధివారిలంక ఇటుక బట్టీలను ఆనుకుని నది ఒడ్డున మట్టి తవ్వకాలు జరిపారు. దీనిపై స్థానిక వీఆర్‌వోకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులో లేరు. ఇంత విచ్చలవిడిగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.



కేదార్లంకలో మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రావులపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కరిస్తా: కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సాధికారిత సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మద్యం దుకాణం ఏర్పాటు తగదు

మండపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండపేటలోని సత్యశ్రీ రోడ్డులో మద్యం దుకాణం వద్దంటూ స్థానిక మహిళలు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. అక్కడ మద్యం దుకాణం తగదని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. బుధవారం మండపేటలో మహిళలు చేస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. వారి వెంట బీజేపీ నియోజకర్గ ఇన్‌చార్జి కె.సాయిరాం, పలువురు ఆ పార్టీ నేతలు వున్నారు.



సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నేతలు అయ్యాజీ వేమా తదితరులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



1975-76 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక శ్రీసర్వారాయ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. 1975-76 బ్యాచ్ టెన్త్ విద్యార్థులంతా తమ కుటుంబాలతో పాఠశాల ప్రాంగణంలో కలిశారు. అప్పటి మధుర జ్ఞాపకాలను పలువురు గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు ప్రభావతి, శాంతిలను సన్మానించారు. తొలుత వేద పండితుల వేదమంత్రాల మధ్య ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 95 ఏళ్ల వయస్సు పూర్తి కావస్తున్న పెద్దింటి వెంకటలక్ష్మీనరసింహాచార్యులను సత్కరించారు. పాఠశాలకు కంప్యూటర్ అవసరాన్ని హెచ్‌ఎం రాజు, విశ్రాంత పశుసంవర్ధక శాఖ సంచాలకుడు గుత్తుల సోమశేఖర్ దృష్టికి తీసుకురాగా ఆయన త్వరలో ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. ఒకే వేదిక మీదకు వారిని చేర్చేందుకు కృషి చేసిన పూర్వవిద్యార్థి మరివాడ వెంకటేశ్వరరావును పలువురు పూర్వ విద్యార్థులు అభినందించారు.



జొన్నాడలో జరిగిన బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి

ఆలమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడపా సత్యనారాయణ అన్నారు. జొన్నాడలో కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు అడపా మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన విధానాలను ఆయన వివరించారు. సమావేశంలో పార్టీ నాయకులు పొట్లూరు రామ్మోహనరావు, అయ్యాజీ వేమా, రామకృష్ణారెడ్డి, సలాది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



నార్కెడిమిల్లి గోదావరి లంకలో అక్రమార్కులు నిర్వహించిన మట్టి తవ్వకాలు

లంకమట్టి తరలిపోతున్నా పట్టించుకోరా?

ఆత్రేయపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): లంక మట్టి కొల్లగొట్టడంతో గోదావరి లంకలు కనుమరగువుతున్నాయి. గౌతమి, వశిష్ట గోదావరి పరివాహక ప్రాంతంలోని లంక భూములు అక్రమార్కులు కొల్లగొట్టుకుపోతున్నారు. అనుమతులు లేకుండానే రాత్రివేళల్లో తవ్వకాలు నిర్వహించి ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. వాడపల్లి లంకలో కొంత కాలం నుంచి లంక మట్టిని అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. లంక రైతులకు కాస్త డబ్బు ముట్టచెప్పి మట్టిని తరలిస్తూ చెరువులను తలపించేలా తవ్వకాలు సాగిస్తున్నారు. నార్కెడిమిల్లిలంకలో గుట్టుచప్పుడు కాకుండా లంక మట్టిని తరలించేస్తున్నారు. దీన్ని నియంత్రించాల్సిన రెవెన్యూ, హెడ్‌వర్క్స్, పోలీస్ యంత్రాంగం అటువైపు చూడకపోవడంతో సర్వత్రా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లంక మట్టికి డిమాండ్ ఏర్పడటంతో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

జడ్పీ పాఠశాలలో బడికిపోదాం కార్యక్రమం

రావులపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గోపాలపురం జడ్పీ పాఠశాలలో మనం బడికి పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ బడిఈడు పిల్లలందరూ బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా లక్ష్మీనారాయణుడి రథోత్సవం

ద్రాక్షారామ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెలంపాలెంలో బుధవారం లక్ష్మీ సమేత నారాయణస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం జరిగింది. బుధవారం మధ్యాహ్నం పలు వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

గ్యాస్ గొడౌన్‌లో చోరీ

కె.గంగవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అముజూరు గ్రామ పరిధిలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ గొడౌన్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గొడౌన్ ఆవరణలోని మూడు వాహనాల అద్దాలు పగలకొట్టి అందులో ఉన్న రూ.6వేలను దొంగిలించారు. వాహనాల యజమాని పెద్దింశెట్టి కేశవ కుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా తెలిపారు.

ఏడిద రోడ్డులో బస్టాండ్‌ను వినియోగించాలి

మండపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండపేట ఏడిద రోడ్డులో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ కోరారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ లేకుండా పోయిందన్నారు. భారీ వాహనాలకు ఉదయం 10 తర్వాత పట్టణంలోకి ప్రవేశం లేకపోయినప్పటికి ఎలాంటి చర్యలు లేవన్నారు. పట్టణంలోకి వచ్చే ప్రైవేటు బస్సులు హారన్‌లతో శబ్దాలు చేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నాయన్నారు. అధికారులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవటంతో పాటు, ఏడిద రోడ్డులో వున్న బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలరావును అభినందిస్తున్న ఎంపీ బోస్

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని అభినందించిన ఎంపీ బోస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావును ఎంపీ బోస్ అభినందించారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన ఆయన్ను ఎంపీ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శీలం గంగరాజు, మట్టా బాబులు, వెంటూరు శివ పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం

ఆలమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గర్భిణిలు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధులు దూరం చేయవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. జొన్నాడలో సీడీపీవో గజలక్ష్మి ఆదేశాల మేరకు పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 8న మొదలైన ఈ పోషణ్ పక్వాడా కార్యక్రమాలు 22వ తేది వరకు నిర్వహిస్తారన్నారు. పౌష్టికాహారం సక్రమంగా ఉండడానికి తీసుకోవలసిన ఆహార పదార్థాలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏఎంవో రాంబాబు

స్టాక్ పాయింట్ పరిశీలన

రాయవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా పాఠశాల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూలు, బెల్ట్, బ్యాగ్, డిక్షనరీని అందిస్తామని సమగ్రశిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు అన్నారు. మండలంలోని రాయవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ విద్యా సామగ్రి కిట్‌లు అందిస్తామని చెప్పారు. ఆయన వెంట ఎంఈవో బి.సూర్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం సునీత, సీఆర్పీలు పాల్గొన్నారు.